ఈనాడు
అమరావతి
గుంటూరు
బుధవారం అక్టోబరు 23, 2024


జగతిన భారతావనిని ప్రతిబింబించే డ్రోన్ల ఆకృతి

వినువీధిలో.. శోభాయమానం

భళా.. లేజర్ షో

అన్నుల మిన్నుల.. అదిరే కన్నుల..


బాణసంచా మెరుపులు

డ్రోన్ల అపూర్వ విహారం

పులకించిన కృష్ణా తీరం

పున్నమిఘాట్‌లో నారీలోకం

శంభో.. శివ శంభో..

నింగికి దూసుకెళ్తున్న డ్రోన్లు

కనుల నిండుగ.. కళల పండగ

మంగళగిరి: ప్రదర్శన తిలకించేందుకు..

కృష్ణా తీరంలో డ్రోన్ల విహంగ విహారంతో.. అద్భుతాలు ఆవిష్కృతమయ్యాయి. ఆకాశంలో అపురూప దృశ్యాలు కనువిందు చేశాయి. గతంలో ఎన్నడూ చూడని అద్భుతమైన డ్రోన్ల ప్రదర్శనను చూసి.. వేల మంది ఆహూతులు కేరింతలు కొట్టారు. కృష్ణా నదీ తీరంలో పున్నమిఘాట్‌లో.. దేశంలోనే ఎన్నడూ లేనన్ని రికార్డుల మోత మోగింది. దేశంలోనే అతిపెద్ద డ్రోన్ల ప్రదర్శనకు వేదికగా నిలిచి.. ఏకంగా ఐదు గిన్నిస్ రికార్డులను నెలకొల్పింది. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుంచి వేల మంది అతిథులు తరలివచ్చి ఈ డ్రోన్ల ప్రదర్శనను తిలకించారు. విజయవాడ, మంగళగిరి కేంద్రాలుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన అమరావతి డ్రోన్ సమ్మిట్‌లో తొలిరోజు.. ఊహకే అందని అద్భుతాలు ఆకాశంలో ఆవిష్కృతమయ్యాయి. మంగళవారం ఉదయం మంగళగిరి వేదికగా సమ్మిట్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు శ్రీకారం చుట్టగా.. కేంద్ర మంత్రి రామ్మోహన్, మంత్రులు వంగలపూడి అనిత, అచ్చెన్నాయుడు, సంధ్యారాణి, సవిత తదితర ప్రజాప్రతినిధులు, సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్ హాజరయ్యారు.

మంగళగిరి సీకే కన్వెన్షన్‌లో జ్యోతి వెలిగించి డ్రోన్ సమ్మిట్ ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు. పక్కనే కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు తదితరులు

డ్రోన్ పనితీరు గురించి తెలుసుకుంటున్న సీఎం

చంద్ర కాంతులు..

కళా వైభవం

కృష్ణా తీరాన యువోత్సాహం

అద్భుతాలు సృష్టిస్తాం

మిన్నంటిన జోష్

మంగళగిరికి తరలివచ్చిన యువతీ యువకులు


అపూర్వం

అమోఘం

యాలీ డ్రోన్
మనుషులు చేరుకోలేని ప్రాంతాలకు దీని ద్వారా వైద్య సామగ్రిని ఇట్టే పంపవచ్చు.

రెడ్ వింగ్
గమ్యం చేరలేని గ్రామీణ ప్రాంతాలకు మందులను చేరవేసే డ్రోన్ పనితీరు తెలుసుకుంటున్న యువత

భద్రతకు భరోసా
రక్షణకు దోహదం చేసే డ్రోన్‌ను పరిశీలిస్తున్న పోలీసులు

అన్నదాతకు అండగా..
పంటలకు పురుగు మందులు పిచికారీ చేసే డ్రోన్‌ను పరిశీలిస్తున్న సందర్శకులు

సర్వేలెన్స్ డ్రోన్
భూ కొలతలు, సర్వేను పారదర్శకంగా చేపట్టే అధునాతన పరికరం

ఈనాడు, అమరావతి, న్యూస్‌టుడే- మంగళగిరి, భవానీపురం, విద్యాధరపురం

డిప్యూటీ సీఎం హామీతో ఆందోళన విరమణ


ఉద్యోగులిచ్చిన వినతిపత్రం పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

మంగళగిరి, న్యూస్‌టుడే: గత మూడురోజులుగా ఉద్యోగ భద్రత, పెండింగ్ వేతనాల కోసం మంగళగిరిలోని జనసేన కేంద్ర కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ప్రభుత్వ ఆసుపత్రి, వైద్య కళాశాలల పొరుగు సేవల ఉద్యోగులకు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ మంగళవారం ఇచ్చిన హామీతో వెనుతిరిగారు. సమస్య తన దృష్టికి వచ్చిందని గత ప్రభుత్వం చేసిన తప్పిదం వల్లే ఇబ్బందులకు గురయ్యారని పవన్ ఉద్యోగులకు వివరించారు. దాదాపు 12 నిమిషాలపాటు వారితో మాట్లాడి సమస్యలపై సానుకూలంగా స్పందించారు. రావాల్సిన బకాయిలపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తమ సమస్యలను విని భరోసా ఇచ్చిన పవన్ కల్యాణ్‌కు వారంతా కృతజ్ఞతలు తెలిపారు.

ఎటు వెళ్తున్నాం మనం?

- ❖ తల్లిదండ్రులను దూరం పెట్టడం మంచిది కాదు
- ❖ వయోవృద్ధుల సంరక్షణ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలి
- ❖ శ్రీనిలయం ప్రారంభోత్సవంలో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు


కార్యక్రమంలో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, తెలంగాణ రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యేలు, కాకతీయ కన్వెన్షన్ సొసైటీ ప్రతినిధులు

ఈనాడు, అమరావతి: వయోవృద్ధుల సంరక్షణకు భారత ప్రభుత్వం తీసుకొచ్చిన అనేక పథకాలు, చట్టాలను ప్రభుత్వాలు కఠినంగా అమలు చేయాలని మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. కుటుంబ విలువలు కాపాడుకుంటూనే అనివార్యమైనప్పుడు పెద్దలకు కష్టం రాకుండా కలసి కట్టుగా నివసించాల్సిన అవసరం ఉందని ఆయన ఉద్ఘాటించారు. తాడికొండ మండలం మోతడక గ్రామంలో కాకతీయ కన్వెన్షన్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీనియర్ సిటిజన్ కంఫర్ట్ హోమ్ (శ్రీనిలయం)ను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీనియర్ పౌరులందరూ సామూహికంగా నివసించడానికి కేంద్రం ఏర్పాటు చేసుకోవడం మంచిదే అయినా మనం ఎక్కడికి పోతున్నాం.. ఏమైపోతున్నాం. ఇంట్లో ఉండకుండా ఇక్కడ ఉండాల్సిన పరిస్థితి ఏమిటి? ఇంట్లో వాళ్లు ఏమైపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. ఉమ్మడి కుటుంబాలే కాదు. క్రమంగా కుటుంబ వ్యవస్థ లేకుండా పోవడం చాలా బాధాకరమన్నారు. సొంతూరిలో ఉంటూ తల్లిదండ్రులను పిల్లలు దూరం పెట్టడం మంచిదికాదని హితవు పలికారు. గతాన్ని, భవిష్యత్తును కలిపే వారధి పెద్దలు. వారధులు సారథులుగా ఉండి కుటుంబాన్ని నడిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యేలు తెనాలి శ్రావణ్‌కుమార్, యరపతినేని శ్రీనివాసరావు, కామినేని శ్రీనివాసరావు, ధూళిపాళ్ల నరేంద్రకుమార్, భాష్యం ప్రవీణ్, గళ్లా మాధవి, నసీర్ అహమ్మద్, ఈశ్వరరావు, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, పారిశ్రామికవేత్త చల్లా రాజేంద్రప్రసాద్, కాకతీయ కన్వెన్షన్ సొసైటీ అధ్యక్షుడు యర్రా నాగేశ్వరరావు, వ్యవస్థాపక అధ్యక్షుడు జీవీ రాయుడు, కార్యదర్శి కొత్తపల్లి రమేష్ కృష్ణచంద్ర, కోశాధికారి దామచర్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

8 ఎకరాల్లో ఏర్పాటు..: మోతడకలో పచ్చని పొలాల నడుమ 8 ఎకరాల్లో కాకతీయ కన్వెన్షన్ సొసైటీ ఏర్పాటైంది. 670 మంది సభ్యులుగా ఉన్నారు. ప్రస్తుతానికి సీనియర్ సిటిజన్ కంఫర్ట్ హోమ్, ఫ్యామిలీ రిక్రియేషన్ సెంటర్, గోశాల నిర్మాణం పూర్తయ్యాయి. భవిష్యత్తులో ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్, కల్చరల్ అండ్ స్పోర్ట్స్ సెంటర్, పాఠశాల, పోటీ పరీక్షలకు శిక్షణ సంస్థ, దేవాలయం, ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయి. ఇవన్నీ కూడా దాతల ఆర్థిక సహకారంతో సేవా దృక్పథంతో ఏర్పాటు చేస్తున్నారు.

రౌడీషీటర్ దాడిలో గాయపడిన యువతి మృతి

❖ నిందితుడిని అరెస్టు చేసిన తెనాలి పోలీసులు ❖ అతను రాజకీయ పార్టీల పదవుల్లో లేడు


సహాన (పాతచిత్రం)

తెనాలి టౌన్, నగరంపాలెం, న్యూస్‌టుడే: రౌడీషీటర్ చేతిలో గాయపడి బ్రెయిన్ డెడ్ స్థితిలో గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న యువతి మంగళవారం మృతి చెందింది. నిందితుడిని పోలీసులు వెంటనే అరెస్టు చేశారు. తెనాలి రెండో పట్టణ పోలీస్‌స్టేషన్లో మంగళవారం విలేకరుల సమావేశంలో డీఎస్పీ బి.జనార్దనరావు, సీఐ నిసార్‌బాషా ఆ వివరాలు వెల్లడించారు. వల్లభాపురానికి చెందిన రౌడీషీటర్ నవీన్, తెనాలి ఐతానగర్‌కు చెందిన సహాన(25) ఆరేళ్లుగా స్నేహితులు. మూడు నెలల కిందట నవీన్‌కు ఆమె రూ.3 లక్షలివ్వగా.. రూ.1.50 లక్షలు తిరిగి చెల్లించాడు. మిగిలిన మొత్తం ఇవ్వాల్సి ఉంది. ఈ నెల 19న ఇద్దరూ కారులో తెనాలి మండలం కఠెవరం శివారుకు వెళ్లారు. అక్కడ సహాన తనకు రావాల్సిన నగదుతో పాటు తాను నవీన్ వల్ల గర్భం (5 వారాలు) దాల్చిన విషయాన్ని తెలియజేసి ఇప్పుడు ఏం చేయాలని ప్రశ్నించారు. దీంతో మాటా మాటా పెరిగిన క్రమంలో యువతి తలను పట్టుకొని కారు డోర్‌కేసి కొట్టాడు. ఆమె వాంతి చేసుకుని పడిపోవడంతో గాభరా పడిన అతను ఆమె తల్లికి సమాచారం ఇచ్చి తెనాలిలోని ప్రైవేటు వైద్యశాలలో చేర్చాడు. అతని స్నేహితులు దత్తు, సుమంత్ సహాయంగా వచ్చారు. సహాన బ్రెయిన్ డెడ్ అయ్యారని స్థానిక వైద్యులు చెప్పటంతో ఆమెను కుటుంబ సభ్యులు గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా మూడు రోజుల చికిత్స అనంతరం మంగళవారం రాత్రి మృతి చెందారు. కారులో నవీన్, సహాన మాత్రమే ఉన్నట్టు తమ విచారణలో తేలిందని, నవీన్ ఏ రాజకీయ పార్టీ పదవుల్లోనూ లేడని, ఇది ప్రేమికుల నడుమ జరిగిన ఘటన అని విలేకరుడిగిన ప్రశ్నలకు డీఎస్పీ సమాధానం చెప్పారు. 2016లో జరిగిన హత్య కేసులో నిందితుల్లో ఒకడైన నేపథ్యంలో నవీన్‌పై రౌడీ షీట్ తెరిచారని, ఆ కేసు ముగిసిందని ఆయన వివరించారు.

'వైకాపా వల్లే మా అబ్బాయి రౌడీషీటర్ అయ్యాడు'

కొల్లిపర: మేము ఉదయం లేస్తే తిరిగేది వైకాపా వారితోనే, పనులు చేసేది వారి దగ్గరే, గతంలో మా అబ్బాయిని కారు నడపటానికి తీసుకెళ్లి రౌడీషీటర్‌గా మార్చారంటూ తెనాలి యువతి సహాన హత్య కేసులో నిందితుడు రాగి నవీన్ తల్లి కుమారి మండిపడ్డారు. మంగళవారం రాత్రి ఆమె వల్లభాపురంలోతన మాటలతో వీడియో విడుదల చేశారు. సహాన కుటుంబం, తాము బంధువులమని, ఇద్దరికి పెళ్లి చేయాలనుకున్నామని, అంతలోనే ఇలా జరిగిందని, తనకూ బాధగానే ఉందన్నారు. మా కుటుంబాల నడుమ జరిగిన విషయాన్ని రాజకీయాలకు ముడిపెట్టటం తగదన్నారు.

అత్యాధునిక వసతులతో సొంతింటి కల సాకారం


జ్యోతి వెలిగించి వార్షికోత్సవాన్ని ప్రారంభిస్తున్న శ్రీభ్రమర టౌన్‌షిప్స్ చైర్మన్ గళ్లా రామచంద్రరావు

పట్టాభిపురం, న్యూస్‌టుడే: అత్యాధునిక వసతులతో ప్రజలకు సొంతింటి కల సాకారం చేస్తున్నామని శ్రీభ్రమర టౌన్‌షిప్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ గళ్లా రామచంద్రరావు పేర్కొన్నారు. గుంటూరు రింగ్‌రోడ్డులోని సిద్ధార్థ గార్డెన్స్‌లో శ్రీభ్రమర హౌసింగ్ సంస్థ వార్షికోత్సవం మంగళవారం నిర్వహించారు. రామచంద్రరావు మాట్లాడుతూ ఇప్పటి వరకు 9,000 మందికి పైగా సొంతింటి కల సాకారం చేశామన్నారు. నిర్మాణ రంగంలో కొత్తదనం సృష్టించాలన్న ఆశయంతో 2015లో శ్రీభ్రమర టౌన్‌షిప్స్‌ను ప్రారంభించామని తెలిపారు. గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో 30కి పైగా అద్భుతమైన ప్రాజెక్టులకు రూపకల్పన చేసి అభివృద్ధి చేసి స్థిరాస్తి రంగంలో ప్రత్యేక ముద్ర వేశామని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో సైతం ఆధునిక సౌకర్యాలతో ప్రాజెక్టులు చేపట్టి నగర జీవనశైలిని సమతుల్యం చేసేందుకు శ్రీభ్రమర కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు మారం చంద్రశేఖర్, ఎం.ఎస్.రాజు, లక్ష్మీపతిరాజు, శైలారెడ్డి, యడ్లపల్లి మురళీకృష్ణ, రావెల గోపాలకృష్ణ, కాకర్ల సతీష్, కమ్మ రవి తదితరులు పాల్గొన్నారు.

'జలా'భినందన



కేంద్ర జల్‌శక్తిశాఖ 2023 సంవత్సరానికి గాను ఉత్తమ సంస్థల కేటగిరీలో ప్రకటించిన 5వ జాతీయ జల అవార్డును దిల్లీలో మంగళవారం కేంద్ర జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్ చేతుల మీదుగా అందుకుంటున్న గుంటూరు కోనేరు లక్ష్మయ్య ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ప్రతినిధులు. - **ఈనాడు, దిల్లీ**

స్వర్ణాంధ్ర కార్పొరేషన్‌లో కుంభకోణంపై విచారణ

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: స్వర్ణాంధ్ర కార్పొరేషన్‌లో రూ.570 కోట్ల కుంభకోణం జరిగిందని మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ, మిర్చియార్డు మాజీ ఛైర్మన్ మన్నవ సుబ్బారావు ఆరోపించారు. వీరు ఇటీవల సీఎం చంద్రబాబును కలిసి ఫిర్యాదు చేయగా.. స్పందించిన ఆయన విచారణ జరిపించాలని విజిలెన్స్ డీజీ హరీష్‌కుమార్‌గుప్తాను ఆదేశించారు. గుంటూరు, రాజమహేంద్రవరం విజిలెన్స్ ఎస్పీలు సూర్యశ్రావణ్‌కుమార్, స్నేహితలను విచారణాధికారులుగా నియమించగా మంగళవారం గుంటూరులోని విజిలెన్స్ కార్యాలయంలో వారు దర్యాప్తు ప్రారంభించారు. రామకృష్ణ, సుబ్బారావులు తమ వద్దనున్న ఆధారాలు ఇచ్చారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 133, రిటైల్ ధర - 155, చికెన్ విత్‌స్కిన్ - 225, చికెన్ స్కిన్‌లెస్ - 256.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -135 రిటైల్ ధర 157 చికెన్ విత్ స్కిన్ - 228, చికెన్ స్కిన్‌లెస్ - 259.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 140, 149, 160 చికెన్ విత్ స్కిన్ - 268 చికెన్ స్కిన్‌లెస్ - 278.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 540 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.95/-.

మంగళగిరి

• మంగళగిరి • తాడికొండ • ప్రత్తిపాడు



ఎలుకలమందు తయారు చేస్తున్న ఉద్యోగులు

ఎలుకల నివారణతో మేలైన దిగుబడి

వట్టిచెరుకూరు, దుగ్గిరాల, మంగళగిరి: ఎలుకల నివారణ మందును గ్రామంలో ఒకే రోజు రైతులు అందరూ కలిపి పొలాలలో ఉంచాలని ఏడీఏ శ్రీనివాసరావు సూచించారు. వట్టిచెరుకూరు మండలంలోని కాట్రపాడు, సౌపాడు, వట్టిచెరుకూరు, కారంపూడిపాడు, ముట్లూరు, కోవెలమూడి గ్రామాలలో ఎలుకల నివారణ చర్యలను ఆయన పరిశీలించారు. దుగ్గిరాల మండలంలో ఏవో శిరీష, మంగళగిరి మండలంలో ఏవో శైలజారాణి ఎలుకల నివారణ మందు పొట్లాలు పంపిణీ చేశారు.

వంగవీటి రాధాకు మంత్రి నారా లోకేశ్ పరామర్శ



తాడేపల్లి, న్యూస్‌టుడే: మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధా ఇటీవల అస్వస్థతకు గురై కోలుకుంటున్న నేపథ్యంలో విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేశ్ మంగళవారం పరామర్శించారు. తాడేపల్లి పరిధిలోని ప్రాతూరులోని ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. దిల్లీ పర్యటన ముగించుకుని విజయవాడ చేరుకున్న లోకేశ్ అనంతరం రాధా ఇంటికి చేరుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

మంగళగిరి: 80085 73111 ప్రత్తిపాడు: 99596 89564 తాడికొండ: 97053 99233

? ప్రత్తిపాడులో 3వ ఆర్‌బీకే ఏర్పాటు చేసిన వీధిలోకి చెత్త సేకరణకు నెలల తరబడి నుంచి పారిశుద్ధ్య కార్మికులు రావడం లేదు. దుర్వాసన వ్యాపిస్తోంది. **- రాజగోపాల్, ప్రత్తిపాడు.**

✔ ఎప్పటికప్పుడు చెత్త సేకరించేలా చర్యలు తీసుకుంటాం.

- షేక్.ఖాజా, పంచాయతీ ఇన్‌ఛార్జి కార్యదర్శి

- ప్రత్తిపాడు, న్యూస్‌టుడే:

స్పందనకు వందనం

పూడిక తీత

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: స్థానిక బీఎస్ఎన్ఎల్ కార్యాలయం రోడ్డులో కాల్వల్లోని మురుగు, వర్షపు నీరు పొంగి పొర్లుతుందని 'మేమున్నాం..మీకు తోడుగా'లో ప్రచురితమైన కథనానికి పంచాయతీ ఇన్‌ఛార్జి కార్యదర్శి ఖాజా స్పందించారు. కాల్వల పూడిక తీయించారు.

వీధి దీపం ఏర్పాటు

మేడికొండూరు, న్యూస్‌టుడే: స్థానిక పోతులూరి వీరబ్రహ్మేంద్రుడు ఆలయం పక్క వీధిలో కొన్నాళ్లుగా వీధి దీపం వెలగడం లేదు. 'మేమున్నాం..మీకు తోడు' శీర్షిక ద్వారా స్థానికులు సమస్యను 'ఈనాడు' దృష్టికి తెచ్చారు. స్పందించిన పంచాయతీ అధికారులు వీధి దీపం ఏర్పాటు చేయించారు.

విద్యుత్తు సరఫరాలో అంతరాయం నేడు

తాడేపల్లి, న్యూస్‌టుడే: పలు ప్రాంతాల్లో బుధవారం విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆ శాఖ డీఈఈ సురేష్‌బాబు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తాడేపల్లి ఆశ్రమం రోడ్డు, ప్రాతూరు ప్రాంతాల్లో, 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు చిర్రావూరు గ్రామంలో సరఫరా ఉండదని పేర్కొన్నారు.

ఆధార్ కేంద్రాల పరిశీలన

మేడికొండూరు, ఫిరంగిపురం, గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆధార్ శిబిరాన్ని వినియోగించుకోవాలని మేడికొండూరు, ఫిరంగిపురం ఎంపీడీవోలు చందన, వెంకటేశ్వరావు తెలిపారు. ఆయా గ్రామాల్లో మంగళవారం ఆధార్ కేంద్రాలను పరిశీలించారు. ఈనెల 25వ తేదీ వరకు కేంద్రాలు పని చేస్తాయని తెలిపారు.

బిక్కుబిక్కుమని.. దేవుడే దిక్కని..

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే

ప్రజలకు కల్పించాల్సిన మౌలిక సౌకర్యాల్లో కీలకమైన రోడ్ల నిర్మాణంపై వైకాపా ప్రభుత్వం అంతులేని నిర్లక్ష్యం చూపింది. రోడ్లు, వంతెనల నిర్మాణాన్ని పక్కన పెట్టింది. ప్రత్తిపాడు నుంచి చినకొండ్రుపాడు, నడింపాలెం మీదుగా జాతీయ రహదారికి వెళ్లే 5 కిలోమీటర్ల ఆర్‌అండ్‌బీ రోడ్డు గుంతలతో దారుణంగా ఉంది. చినకొండ్రుపాడు ఎస్సీ ఏరియా వద్ద నేల వంతెన పూర్తిగా దెబ్బతింది. అధిక వర్షాలకు వంతెన మీదుగా వరద నీరు ఉద్ధృతంగా ప్రవహించడంతో మూడేళ్ల క్రితమే సగం శ్లాబు కూలిపోయింది. దీంతో బిక్కుబిక్కుమంటూ ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు.

25 కిలో మీటర్లు చుట్టూ తిరిగాల్సిందే..

ప్రత్తిపాడు నుంచి జాతీయ రహదారికి వెళ్లేందుకు గొట్టిపాడు రోడ్డు, చినకొండ్రుపాడు, తిక్కిరెడ్డిపాలెం గ్రామాల మీదుగా మూడు రహదారులు ఉన్నాయి. మూడు రోడ్లు గుంతలతో అధ్వానంగా ఉన్నాయి. చినకొండ్రుపాడు మార్గంలో 5 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తే జాతీయ రహదారికి వెళ్లవచ్చు. దీంతో కాటూరి వైద్యశాలకు, ఇంజినీరింగ్ కళాశాలలకు, పాఠశాలలకు వెళ్లేందుకు విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు ఇటుగానే రాకపోకలు సాగిస్తుంటారు. ప్రస్తుతం రోడ్డు అధ్వానంగా మారడంతో ఏటుకూరు మీదుగా 25 కిలోమీటర్లు అదనంగా ప్రయాణిస్తున్నారు. జాతీయ రహదారి నుంచి ప్రత్తిపాడు మీదుగా వంగిపురం వరకు రోడ్డు నిర్మాణానికి రూ.12 కోట్ల నిధులు మంజూరు చేసింది. ప్రత్తిపాడు నుంచి పాతమల్లాయపాలెం వరకు 2022లో రోడ్డు నిర్మాణం చేపట్టినా గుత్తేదారుడికి వైకాపా ప్రభుత్వం బిల్లులు చెల్లింపులు చేయలేదు. దీంతో మిగిలిన రోడ్డు నిర్మాణ పనులు నిలిచాయి. ఎమ్మెల్యే రామాంజనేయులు, ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్ చొరవ తీసుకుని రోడ్డు, వంతెన నిర్మాణానికి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కూలిన చినకొండ్రుపాడు నేల వంతెన



దెబ్బతిన్న నిర్మాణం మీదుగా రాకపోకలు

అక్రమాలపై కొనసాగుతున్న విచారణ

మేడికొండూరు, న్యూస్‌టుడే: మండలంలోని యలవర్తిపాడు రెవెన్యూ పరిధి పంట నష్ట పరిహారం పంపిణీ వ్యవహారంలో అక్రమాలు రోజు రోజూకు బయటపడుతున్నాయి. మంగళవారం 6వ రోజూ విచారణ కొనసాగింది. కొత్తగా మరో 15 మంది పేర్లు వెలుగులోకి వచ్చాయి. ఇప్పటికీ మొత్తంగా రూ.16.56లక్షలు రికవరీ చేసినట్లు అధికారులు తెలిపారు. బుధవారం కూడా విచారణ జరుగుతుందని తెలిపారు. ఏడీఏ(డీఆర్‌సీ) సునీత, ఫిరంగిపురం ఏవో వాసంతి తెలిపిన వివరాల మేరకు యలవర్తిపాడు రెవెన్యూ పరిధిలో పంట నష్ట పరిహారం పంపిణీ విషయంలో అవకతవకలు జరిగాయని ఆరోపణలు రావడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విచారణ చేస్తున్న సంగతి తెలిసిందే. 106 హెక్టారుల్లో పత్తి పంట దెబ్బతిందని 104 మంది రైతులకు రూ.18.5లక్షలు పరిహారం సొమ్ము జమ చేసిన విషయం విదితమే. కొత్తగా మేడికొండూరు, గుండ్లపాలెం నివాసులు, సిరిపురానికి చెంది గుంటూరులో ఉంటున్న మొత్తం 15 మంది పేర్లు విచారణలో బయటపడ్డాయని తెలిపారు. దీనిలో భాగంగా ఇప్పటికీ మొత్తంగా 38 మంది రూ.16.56 లక్షలు తిరిగి కట్టారని తెలిపారు. అనేక కోణాల్లో విచారణ జరుగుతుందని తెలిపారు. ఈ నేపథ్యంలో బుధవారం కూడా విచారించాల్సి ఉంటుందని తెలిపారు.

ఇళ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసుకోవాలి



మాట్లాడుతున్న జి.ప్రసాద్, పక్కన వివిధ శాఖల ఉన్నతాధికారులు

పెదనందిపాడు, న్యూస్‌టుడే: ప్రధాన మంత్రి ఆవాస్ యోజన గ్రామీణ పథకం కింద గృహాలు మంజూరైన లబ్ధిదారులు త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఉప సంచాలకులు జి. ప్రసాద్ సూచించారు. పెదనందిపాడు మండలం వరగానిలో ఈ పథకం కింద నిర్మించిన ఇళ్లను ఆయన, కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ కార్యదర్శి శైలేష్‌కుమార్ సింగ్, రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఎండీ పి.రాజబాబులతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వరగానిలో 2016- 17, 2017-18, 2021-22 సంవత్సరాల్లో 61 మందికి ఇళ్లు మంజూరు కాగా.. 17 మంది మాత్రమే నిర్మాణం పూర్తి చేశారని, మిగిలిన ఎందుకు నిర్మించుకోలేదని లబ్ధిదారులను ప్రశ్నించారు. ఆర్థిక ఇబ్బందులు, వ్యవసాయంలో నష్టాల వల్ల నిర్మాణాలు పూర్తి చేయలేక పోయామని లబ్ధిదారులు అధికారులకు వివరించారు. ఇప్పటికే పూర్తయిన గృహాలు చక్కగా ఉన్నాయని కితాబు ఇచ్చారు. రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఎండీ పి.రాజబాబు మాట్లాడుతూ ప్రభుత్వం స్వయం సహాయ సంఘాల సభ్యులకు ఇంటి నిర్మాణం నిమిత్తం సున్నా వడ్డీకి రుణం అందిస్తోందన్నారు. కార్యక్రమంలో గ్రామీణాభివృద్ధి శాఖ ఉప సంచాలకులు చాహద్, గృహ నిర్మాణ శాఖ సీఈ వీరేశ్వర ప్రసాద్, ఎస్ఈ జయరాంచారి, పీడీ ప్రసాద్, ఈఈ శంకరరావు, ఏపీ, తెలంగాణ, ఒడిశా, ఝార్ఖండ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల ప్రతినిధులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

'కూటమి'తో అమరావతికి మంచి రోజులు

తుళ్లూరు, న్యూస్‌టుడే: రాజధాని అమరావతికి శంకుస్థాపన చేసిన రోజును పురస్కరించుకుని ఉద్దండరాయునిపాలెంలో రైతులు, రైతు కూలీలు, మహిళలు పూజలు నిర్వహించి పొంగళ్లు చేశారు. పవిత్ర మట్టి, నీరు ఉంచిన ప్రాంతంలో దేవతా చిత్రపటాలకు పూజలు చేశారు. అమరావతికి ఏర్పడిన విఘ్నాలన్నీ తొలగిపోయి రాజధాని నిర్మాణం నిరాటంకంగా సాగాలని వేడుకున్నారు. రాబోయే రోజుల్లో ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా రాజధాని మార్పు లేకుండా కూటమి ప్రభుత్వం భద్రత కల్పించాలని కోరారు. అమరావతి శరవేగంగా నిర్మాణం చేసేలా ముఖ్యమంత్రి చంద్రబాబుకు భగవంతుడు ఆశీస్సులు ఉండాలని వేడుకున్నారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మంచి రోజులు వచ్చాయని అమరావతి నిర్మాణంతో అమరావతి అభివృద్ధి పథంలోకి రావాలని ఆకాంక్షించారు. కాగా, 2015 అక్టోబర్ 22న ప్రధాని నరేంద్రమోదీ అమరావతి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.



రాజధాని శంకుస్థాపన ప్రాంతంలో పూజలు చేస్తున్న రైతులు, మహిళలు

కంపెనీలో వాటా ఇస్తామని.. రూ.18 కోట్లకు టోకరా

మహిళను మోసగించిన నలుగురిపై కేసు

ఈనాడు- హైదరాబాద్: కంపెనీ డైరెక్టర్ చేస్తామంటూ ఓ మహిళను నమ్మించిన నలుగురు.. ఆమె గ్యారంటీతో బ్యాంకు నుంచి రూ.18.5 కోట్లు రుణం తీసుకుని మోసగించిన వ్యవహారంలో సైబరాబాద్ పోలీసులు నలుగురిపై కేసు నమోదు చేశారు. మాదాపూర్‌కు చెందిన మహిళ కుమారుడికి ఎం.అనిల్ కుమార్ పరిచయస్థుడు. కుమారుడితో స్నేహం చేస్తూ మహిళ కుటుంబంతో అనిల్‌కుమార్ పరిచయం పెంచుకున్నాడు. ఈ క్రమంలోనే నాచారంలోని మూడంతస్తుల భవనం కొనుగోలు చేస్తానని చెప్పాడు. అడ్వాన్సుగా రూ.5 లక్షలు కట్టాడు. మిగిలిన డబ్బు కొంత సమయం తీసుకొని చెల్లిస్తానని ఒప్పందంలో పేర్కొన్నాడు. ఆ తర్వాత డబ్బు సర్దడం ఇబ్బంది అవుతోందని అనిల్‌కుమార్ మూడు నెలల సమయం కోరాడు. కొత్తగా వ్యాపారం ప్రారంభిస్తున్నానని.. డబ్బుకు బదులు తన తల్లి ముప్పాళ్ల సుధారాణి, వంశీకృష్ణ వర్మ, రుక్మిణీ దేవి ప్రమోటర్లుగా ఉంటున్న మంగళగిరిలోని కాంచీపురం మురుగన్ సిల్క్స్ ప్రైవేటు లిమిటెడ్, వరలక్ష్మీ టెక్స్‌టైల్స్‌లో 93 శాతం వాటాలు ఇస్తానని చెప్పాడు. కొత్తగా చందానగర్‌లో టెక్స్‌టైల్ స్టోర్ ఏర్పాటు చేయాలనుకుంటున్నట్లు పేర్కొన్నాడు. రెండు సంస్థల్ని విస్తరించేందుకు టర్మ్‌లోన్ కోసం ఎస్‌బీఐ నుంచి సూత్రప్రాయంగా అనుమతి లభించిందని.. ఇందుకు నాచారంలోని భవనాన్ని తనఖా పెట్టాలని మహిళను కోరారు. పరస్పర ఒప్పందం కుదుర్చుకున్నారు. నిజమని నమ్మిన మహిళ సంస్థలో భాగస్వామిగా చేరేందుకు డైరెక్టర్ ఆఫ్ కంపెనీస్ దగ్గర సమ్మతం తెలిపింది. రెండు సంస్థలు ఎస్‌బీఐ సైఫాబాద్ బ్రాంచి నుంచి రూ. 18.5 కోట్ల రుణం తీసుకోవడానికి పూచీకత్తు ఇచ్చింది.

రుణం నిధులు పక్కదారి..!: రుణం మంజూరైనా అప్పటికి సంస్థల్లో మహిళకు ఎలాంటి భాగస్వామ్యం లేదు. కేవలం ప్రమోటర్లుగా వ్యవహరిస్తున్న వారే నడిపించారు. మురుగన్ సిల్క్స్ సంస్థలో 93 శాతం విలువుండే 1.25 లక్షల షేర్లు, వరలక్ష్మీ టెక్స్‌టైల్స్‌లో నామమాత్రపు షేర్లు ఇస్తున్నట్లు చెప్పినా ఎలాంటి ధ్రువపత్రాలు ఇవ్వలేదు. చెక్కు అధికారం ఇవ్వలేదు. బ్యాంకు రుణంగా ఇచ్చిన డబ్బుని ఏం చేశారో చెప్పలేదు. 2024 మేలో ముప్పాళ్ల అనిల్‌కుమార్ రూ.4.87 కోట్లు మహిళకు బదిలీ చేసి నాచారంలోని భవనం కొనుగోలు చేసినట్లు సేల్‌డీడ్ చేయించుకున్నాడు. ఈ క్రమంలోనే రుణం డబ్బులు పక్కదారి పట్టించినట్లు ఎస్‌బీఐ ఫోరెన్సిక్ ఆడిట్‌లో తేలింది. రుణం డబ్బు, కంపెనీలో భాగస్వామ్యం గురించి మాట్లాడేందుకు మహిళ ప్రయత్నించగా అనిల్ కుమార్ మిగిలిన వ్యక్తులు స్పందించడం మానేశారు. కంపెనీలో 93 శాతం వాటా ఇస్తామని చెప్పినా.. కొన్ని దస్త్రాలు ఫోర్జరీ చేసి 23 శాతానికి తగ్గించారు. దీనిపై బాధితురాలు ఎన్‌సీఎల్‌టీ(నేషనల్ కంపెనీస్ లా ట్రిబ్యునల్)ను ఆశ్రయించారు. రుణాన్ని పక్కదారి పట్టించి నెల్లూరు, గుంటూరులోనూ బ్రాంచీలు ఏర్పాటు చేశారు. బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదైంది.

పిల్లలు దగ్గర లేని లోటు వృద్ధులకు రానివ్వం



శ్రీనిలయాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, చిత్రంలో ప్రజాప్రతినిధులు, ప్రముఖులు

తాడికొండ, న్యూస్‌టుడే: ఆధునిక జీవన విధానంలో సంపదలు ఉన్నా వృద్ధాప్యంలో ఒంటరి జీవితాలు గడపాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని శ్రీనిలయం అధ్యక్షుడు యర్రా నాగేశ్వరరావు పేర్కొన్నారు. తాడికొండ మండలం మోతడక గ్రామంలో కాకతీయ కన్వెన్షన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీనియర్ సిటిజన్స్ కంఫర్ట్ హోమ్ శ్రీనిలయాన్ని మాజీ ఉప రాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు నాగేశ్వరరావు మాట్లాడుతూ పిల్లలు దగ్గర లేని లోటును తల్లిదండ్రులకు తీర్చేందుకే ఈ సొసైటీ ప్రారంభించామని చెప్పారు. వృద్ధులకు అవసరమైన అన్ని వసతులు కల్పించామన్నారు. సహాయం అందించిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొని మాట్లాడుతూ తోటి వారికి సహాయం అందించి వారి అభ్యున్నతికి తోడ్పడాలని, చేసిన సాయం మాత్రమే మరణించిన తరువాత కూడా బ్రతికి ఉంటుందన్నారు. కార్యక్రమంలో పలువురు ఎమ్మెల్యేలు, సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

పీఎం సూర్య ఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న రమేష్, పక్కన ఎంపీపీ అన్నమ్మ, జడ్పీటీసీ సభ్యుడు కృష్ణారెడ్డి, తదితరులు

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: పీఎం సూర్య ఘర్ పథకాన్ని గృహ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ శాఖ ఈఈ సీహెచ్.రమేశ్ కోరారు. ప్రత్తిపాడు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దాసరి అన్నమ్మ అధ్యక్షతన మంగళవారం మండల సర్వసభ సమావేశం జరిగింది. శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ పథకం విధి విధానాలను వివరించారు. శీతల గిడ్డంగుల్లో నిల్వ చేసిన రైతులను గిడ్డంగి నిర్వాహకులు మోసం చేస్తే వారి నుంచి 20 రోజుల్లో రైతులకు డబ్బులు ఇప్పించిన కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే రామాంజనేయులకు జడ్పీటీసీ సభ్యుడు విప్పాల కృష్ణారెడ్డి కృతజ్ఞతలు చెప్పారు. రెండేళ్ల క్రితం ప్రత్తిపాడులో పురుగుల మందు వ్యాపారి రూ.36 కోట్లతో రైతులను మోసం చేస్తే అధికారంలో ఉండి కూడా రైతులకు ఎలాంటి న్యాయం చేయలేకపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. మండల సర్వసభ్య సమావేశానికి గైర్హాజరైన అధికారులకు మెమోలను అందించి కలెక్టరు ఎస్.నాగలక్ష్మి దృష్టికి తీసుకెళ్తామని ఎంపీడీవో కె.శివపార్వతి చెప్పారు. కార్యక్రమంలో ఉప ఎంపీపీలు ఆఫ్రిన్ సుల్తానా, రమాదేవి, పీఎం సూర్య పథకం నోడల్ ప్రత్యేకాధికారి తులసీరామ్, డీఈ గురునాథరావు ఏఈ గౌతమ్, పలు శాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.

తీరనున్న అలీనగర్ వాసుల కష్టాలు

మూడు వీధులను దుగ్గిరాలలో కలిపేందుకు కార్యాచరణ ☛ మంత్రి లోకేశ్ చొరవతో ముందడుగు



ఓటర్ల సర్వే చేస్తున్న డీఎల్‌పీవో స్వరూపరాణి, పంచాయతీల సిబ్బంది

దుగ్గిరాల, న్యూస్‌టుడే: దుగ్గిరాల అలీనగర్‌లో విచిత్ర పరిస్థితిని అధిగమించేందుకు మంత్రి లోకేశ్ చొరవతో కార్యాచరణ మొదలైంది. అలీనగర్‌లో ఎక్కువ భాగం మంగళగిరి నియోజకవర్గం దుగ్గిరాల గ్రామ పంచాయతీ ఉంది. మూడు వీధులు మాత్రం తెనాలి మండలం కొలకలూరు పంచాయతీలో ఉన్నాయి. స్థానిక పంచాయతీ 200 మీటర్ల దూరంలోనే ఉన్నా.. ఈ మూడు వీధుల్లో ఉన్న 55 కుటుంబాలవారు మాత్రం ఏ చిన్న అవసరమున్నా 6 కిలోమీటర్ల దూరంలో ఉన్న కొలకలూరు పంచాయతీకి వెళ్లాలి. దశాబ్దాల క్రితం ఇలా అసంబద్ధంగా విభజించడంతో ఇక్కడి ప్రజలు పడుతున్న అవస్థలు అన్నీ ఇన్నీ కావు. ఎన్నోసార్లు దుగ్గిరాలలో కలపండి మహాప్రభో అని అర్జీ పెట్టుకున్నా పట్టించుకున్న నాథుడు లేరు. రేషన్ తీసుకోవాలన్నా, పింఛను అందుకోవాలన్నా ఆరు కిలోమీటర్లు ప్రయాణించాల్సిందే. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో స్థానికుడైన అప్పటి ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్‌కుమార్ ఈ సమస్య పరిష్కారానికి నడుం కట్టారు. మూడు వీధులు దుగ్గిరాలలో కలిసేలా ప్రయత్నం చేశారు. రెండు గ్రామాల పంచాయతీలూ నిరభ్యంతర తీర్మానాలు ఇచ్చాయి. జిల్లా, రాష్ట్ర స్థాయిలో దీనికి సంబంధించిన దస్త్రానికి కదలిక వచ్చింది. దీంతో అలీనగర్ ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్న దశలో సార్వత్రిక ఎన్నికలు వచ్చాయి. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం, అప్పటి ఎమ్మెల్యే వీరి గోడు విన్పించుకోలేదు. దీంతో చివరి వరకూ వచ్చిన ప్రక్రియ ఆగిపోయింది. మళ్లీ ఇప్పుడు కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు తమను దుగ్గిరాలలో కలపాలని వేడుకున్నారు. మంత్రి లోకేశ్‌కూ మొరపెట్టుకున్నారు. ఫలితంగా మళ్లీ కదలికలు వచ్చాయి. మంగళవారం తెనాలి డీఎల్‌పీవో స్వరూపరాణి ఆధ్వర్యంలో కొలకలూరు, దుగ్గిరాల పంచాయతీల సిబ్బంది మూడు వీధుల్లో ఇంటింటి సర్వే చేశారు. కొలకలూరు సర్పంచి ప్రీతి కూడా వచ్చారు. సుమారు 190 మంది ఓటర్లు ఉన్నారని అలీనగర్ ప్రజలు చెబుతున్నారు. సమగ్రంగా సర్వే చేసి నివేదికను ఉన్నతాధికారులకు ఇస్తామని డీఎల్‌పీవో తెలిపారు. ఇదే సమయంలో డీపీ అగ్రహారాన్ని కొలకలూరు పంచాయతీలో కలిపేస్తే అక్కడున్న సుమారు 60 కుటుంబాల ప్రజలకు కష్టాలు ఉండవు. ప్రభుత్వ పరమైన ఏ అవసరం ఉన్నా రెండు బస్సులు మారి దుగ్గిరాల రావాల్సి వస్తోందని ఇక్కడి ప్రజలు చెబుతున్నారు.

భూ సమస్యల పరిష్కారానికి అర్జీలు

దుగ్గిరాల, న్యూస్‌టుడే: సమగ్ర భూ సర్వే చేసిన దేవరపల్లి అగ్రహారంలో మంగళవారం జరిగిన గ్రామ సభలో 13 మంది రైతులు అర్జీలు ఇచ్చారు. దుగ్గిరాల 16వ వార్డులో కొంత భాగమైన ఈ శివారు గ్రామంలో భూ సమస్యల పరిష్కారానికి తహసీల్దార్ సునీత ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. మండల సర్వేయర్ గోపాలరావు, ఆర్ఐ త్రివేణి, వీఆర్వోలు జయకాంత్, అనిల్‌వర్మ, సర్వేయర్ వెంకటేష్ ఉన్నారు.

పెదనందిపాడు, న్యూస్‌టుడే: రైతులు భూ సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని, అందులో భాగంగా గ్రామ సభలు నిర్వహిస్తోందని ఉప తహసీల్దార్ కరీముల్లా అన్నారు. రాజుపాలెం పంచాయతీ కార్యాలయంలో రీ సర్వేకు సంబంధించి మంగళవారం నిర్వహించిన సభలో ఎనిమిది మంది రైతులు దరఖాస్తులు అందజేశారు. మండల సర్వేయర్ శ్రీనివాసరావు, సీనియర్ సహాయకులు యహోషువా, వీఆర్వో వీరయ్య, వీఎస్ చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.



దేవరపల్లి అగ్రహారంలో..



పెదనందిపాడు: ఉప తహసీల్దార్ కరీముల్లాకు దరఖాస్తు అందజేస్తున్న మహిళా రైతు

కుక్కను తప్పించబోయి చెట్టును ఢీకొట్టిన లారీ

ఉల్లిపాయల వ్యాపారి మృతి

మేడికొండూరు, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఉల్లిపాయల వ్యాపారి మృతి చెందిన ఘటనపై కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కర్నూలు జిల్లా నందికొట్కూరు మండలం బ్రాహ్మణ కోడూరుకు చెందిన తెలుగు యల్లప్ప(61) ఉల్లిపాయల వ్యాపారం చేస్తుంటారు. వ్యాపారం నిమిత్తం లారీలో ఉల్లిపాయలు తీసుకుని పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం బయలుదేరారు. మంగళవారం తెల్లవారుజామున మండలంలోని డోకిపర్రు శివారు వద్ద ఒక్కసారిగా లారీకి కుక్క అడ్డుగా వచ్చింది. దాన్ని తప్పించే క్రమంలో లారీ అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీ కొట్టింది. ప్రమాదంలో యల్లప్ప, పక్కనే ఉన్న మరో వ్యక్తి బాషా ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం క్షతగాత్రులను 108 వాహనంలో గుంటూరు సర్వజనాసుపత్రి తరలించగా.. చికిత్స పొందుతూ యల్లప్ప మృతి చెందారు మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పూల సాగుపై రైతుల మొగ్గు


పెదవడ్లపూడి (మంగళగిరి), న్యూస్‌టుడే

మంగళగిరి మండలం పెదవడ్లపూడి పేరు చెప్పగానే గుర్తుకొచ్చేవి పూల గుబాళింపు. సీజన్ సంబంధం లేకుండా నిత్యం సిరులు కురిపిస్తోన్న ఈ సాగుపై రైతులు మక్కువ చూపుతున్నారు. ఒకనాడు కరివేపాకు పంటతో కళకళలాడిన ఈ ప్రాంతం... దానిలో వస్తున్న నష్టాలు కారణంగా ప్రత్యామ్నాయంగా పూల తోటలపై దృష్టిసారించారు. సొంత భూమి కలిగిన రైతులతోపాటు కౌలుకు తీసుకుని పూల తోటలు వేసిన రైతులు సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. పెదవడ్లపూడి, దాని పరిసర గ్రామాల్లో సుమారు 2,000 ఎకరాల్లో మల్లె, చామంతి, బంతి, గులాబీ, కనకాంబరాలు ఇతర పూలతోటలు రైతులు సాగుచేస్తున్నారు. దీనిపై ప్రత్యక్షంగా సుమారు 1000 మంది రైతుల కుటుంబాలు, పరోక్షంగా మరో వెయ్యి కుటుంబాలు ఆధారపడి ఉన్నాయి. పండగల సమయాల్లో కిలో మల్లెలు రూ. వెయ్యి ధర పలుకుతుంటాయి. కాలంతో పని లేకుండా రాబడి వస్తుండడంతో సాగుదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



బంతి పూలతోట

ఏడాది పొడవునా ఆదాయం



ఒక్కసారి మల్లె తోటపై పెట్టుబడి పెడితే నిరంతరం ఆదాయం ఉంటుంది. ఏడాదికి రూ.80 వేలు చొప్పున కౌలుకు తీసుకున్నాను. ప్రతి రోజూ దిగుబడి వస్తుంది. సీజన్‌లో వంద కిలోలు పూలొస్తే అన్ సీజన్‌లో ఐదు నుంచి పది కిలోల దిగుబడి సాధిస్తాం.

-సాదం బాజి, రైతు, పెదవడ్లపూడి.

రోజూ పని దొరుకుతుంది..



పూలతోటలు జీవనోపాధి కల్పిస్తున్నాయి. నిత్యం పని లభిస్తుంది. 15 మంది బృందంగా ఉండి పూలుకోయడానికి వెళతాం. దారి ఖర్చులు రైతులే ఇస్తారు. ఒక్కొక్కరికి రూ.200 కూలి ఇస్తున్నారు. నిత్యం పని లభిస్తుండటంతో సాఫీగా జీవనం సాగిపోతుంది. **-మల్లేశ్వరి, జోజవతి, కూలీలు, ఈమని**

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

తాడేపల్లి: చినకాకాని ఎన్నారై జంక్షన్‌లో జాతీయ రహదారిపై ఈనెల 20వ తేదీ రాత్రి ఓ కారు.. ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఘటనలో ద్విచక్ర వాహనదారుడు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాకపోవడంతో పోలీసులు మృతదేహాన్ని మంగళగిరి ఎయిమ్స్ వైద్యశాల శవాగారానికి తరలించారు. రెండురోజులు గడిచినా మృతుని కోసం ఎవరూ రాకపోవడంతో కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ, వివరాలు తెలిస్తే మంగళగిరి గ్రామీణ పోలీసుస్టేషన్‌లో తెలియజేయాలని ఎస్ఐ వెంకట్ తెలిపారు.

చికిత్స పొందుతూ మరొకరు..

గుంటూరు రూరల్: జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు మంగళవారం నల్లపాడు పోలీసులు తెలిపారు. అమరావతి రోడ్డు నగరాల సమీపంలోని ఓ బార్ అండ్ రెస్టారెంట్ ఎదుట అపస్మారక స్థితిలో పడి ఉన్న వ్యక్తిని స్థానికులు గుర్తించి 108 వాహనంలో ఆసుపత్రికి తరలించారు. చికిత్స అందిస్తున్న సమయంలో వ్యక్తి మృతి చెందాడు. మృతుడికి 50 ఏళ్లు ఉంటాయని, ఇతర వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు చెప్పారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

తుళ్లూరు, న్యూస్‌టుడే: వెంకటపాలెం గ్రామానికి చెందిన ఓ యువతి సోమవారం నుంచి కనిపించడం లేదు. కుటుంబ సభ్యులు గాలించినా ఆచూకీ దొరకలేదు. ఆమె సోదరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తుళ్లూరు సీఐ గంగా వెంకటేశ్వర్లు తెలిపారు.

మధ్యాహ్న భోజన పరిశీలన

దుగ్గిరాల: దుగ్గిరాల తహసీల్దార్ సునీత మంగళవారం దేవరపల్లి అగ్రహారంలో ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. అక్కడి పిల్లలతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి నాణ్యత పరిశీలించారు. ఆర్ఐ త్రివేణి, అధికారులు ఉన్నారు.

తెనాలి

•తెనాలి •పొన్నూరు

సూరత్‌కు అంబేడ్కర్ విగ్రహాలు



విగ్రహాలతో శిల్పులు వెంకటేశ్వరరావు, రవిచంద్ర

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ భారీ కాంస్య, ఫైబర్ గ్లాస్ విగ్రహాలను తయారు చేశామని, వాటిని సూరత్ నగరానికి తరలిస్తున్నట్లు తెనాలి సూర్య శిల్ప శాల శిల్పులు కాటూరి వెంకటేశ్వరరావు, రవిచంద్ర మంగళ వారం ఇక్కడ తెలిపారు. గతంలో కుర్చీలో కూర్చుని ఉన్న అంబేడ్కర్ విగ్రహాన్ని అహ్మదాబాద్ పంపితే అక్కడి వారి నుంచి ప్రశంసలు లభించాయని వివరించారు.

సాయినామ సంకీర్తనతో భక్తుల పరవశం



తెనాలి టౌన్, న్యూస్‌టుడే: నందివెలుగులోని శ్రీసాయిక్షేత్రం శ్రీషిర్డి సాయిబాబా మందిర 12వ వార్షికోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. బాబాకు పంచామృత అభిషేకాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. సాయినామ సంకీర్తనతో భక్తులు పరవశించారు. కమిటీ ప్రతినిధులు పర్యవేక్షించారు.

సృజనకు పదును



శ్రీచైతన్య ఉన్నత పాఠశాలలో పి.హరిప్రీతమ్ (తొమ్మిదో తరగతి) ప్రథమ, జి.తేజస్విని (ఎనిమిదో తరగతి) ద్వితీయ, డి.శ్రీచందన (తొమ్మిదో తరగతి) తృతీయ స్థానాలను పొందగా ప్రిన్సిపల్ కె.మాధురి విజేతలకు బహుమతులు ఇచ్చారు.



నెహ్రూనికేతన్ ఉన్నత పాఠశాలలో వి.అభిరామ్‌హర్ష (తొమ్మిదో తరగతి) ప్రథమ, టి.ప్రియనందినిరెడ్డి (పదో తరగతి) ద్వితీయ, పి.వి.ధరణి (తొమ్మిదో తరగతి) తృతీయ స్థానాలను సాధించగా పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ దాసరి మురళీకాంత్ బహుమతులు అందించారు.

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: సామాజిక పరిస్థితులపై అవగాహన, నైపుణ్యాలను గుర్తించే సదాశయంతో 'ఈనాడు' ఆధ్వర్యంలో తెనాలి పట్టణ చెంచుపేటలోని శ్రీచైతన్య, బోస్‌రోడ్డులోని నెహ్రూనికేతన్ ఉన్నత పాఠశాలల్లో మంగళవారం విద్యార్థులకు నిర్వహించిన ప్రతిభా పాటవ పోటీలకు మంచి స్పందన లభించింది. 'అంతర్జాల వినియోగంలో లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అంశంపై జరిపిన వ్యాస రచన పోటీల్లో 8,9,10 తరగతుల విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై తమ ఆలోచనలను పంచుకున్నారు.

ఐతానగర్‌లో అన్నీ అవస్థలే



డ్రెయిన్ లేక వాడుక నీటిని రోడ్డు అవతలకు వదులుతున్నారిలా..



హయ్యర్‌పేట రోడ్డు మధ్య తాగునీటి పైపుల కోసం తవ్వి పూడ్చి కాంక్రీటు వేయకుండా..

వార్డులు	జనాభా	కుటుంబాలు
1,39,40	12,545	2,985

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: పట్టణంలోని ఐతానగర్‌లో వైకాపా ప్రభుత్వ హయాంలో చేపట్టిన పలు అభివృద్ధి పనుల్లో కొన్ని అసంపూర్తిగా, మరి కొన్ని ప్రారంభానికే నోచుకోక వెక్కిరిస్తున్నాయి. ప్రజలకు అవస్థలు తప్పడంలేదు. ★ ఐతానగర్ హిందూ శ్మశాన వాటికలో చేపట్టిన గ్యాస్ ఆధారిత దహన వాటిక పనులను ఆర్థిక సంఘం నిధులు గడువు తీరే లోపు పూర్తి చేయలేదు. ★ గత తెదేపా ప్రభుత్వ హయాంలో చేపట్టిన పైకస్ పార్కును పూర్తి చేయించి వినియోగంలోకి తేవడాన్ని విస్మరించారు. ★ ఐతానగర్ లింగారావు సెంటర్ నుంచి గోలిడొంకకు పైపు లైన్ల పనులు దక్కించుకున్న గుత్తేదారు ప్రారంభించక పోయినా అధికారులు పట్టనట్టు ఉన్నారు. ఆయన చేపట్టిన పనులు పూర్తి చేయక పట్టణ ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ★ వీఎస్ ఆర్ ఎన్‌వీఆర్ కళాశాల రోడ్డులో, హయ్యర్‌పేటలో భూగర్భంలో తాగునీటి పైపులు వేసి పూడ్చి కాంక్రీటు వేయకుండా వదిలేశారు. ★ కొత్తమాసు తులసీదాసు సామాజిక భవనం వద్ద ఖాళీ స్థలంలో వ్యాయామ పరికరాలు బిగించారు. ఇవి నిర్వహణ లేక నిరుపయోగంగా ఉన్నాయి. ★ కాకుమానువారి వీధిలో కాలువలు నిర్మించక ఎక్కడ మురుగు అక్కడే రోడ్ల పక్క, ఖాళీ స్థలాల్లో తిష్ట వేసింది. ఇళ్లకు తాగునీటి కుళాయిలు ఇవ్వలేదని స్థానికులు వాపోతున్నారు. ఇంటి ముందు రోడ్డుకు ఒక పక్క కాలువ లేక గొట్టాలకు ప్లాస్టిక్ కవర్లు తొడిగి సీసీ రోడ్డు అవతల నిర్మించిన పక్కా కాలువలోకి మురుగు మళ్లిస్తున్నారు.

తాగునీరు వృథా.. పక్కా కాలువలు శుభ్రం చేయట్లేదు. కాలువల్లో వ్యర్థాలు వేయడం పరిపాటి అయింది. రోడ్లపై చిందర వందరగా పడి ఉన్న తాగునీటి పైపుల మీదుగా వాహనదారులు ఇబ్బందిగా రాకపోకలు సాగిస్తున్నారు. పలు చోట్ల కుళాయిల నీరు వృథాగా పోతోంది. ఈ ప్రాంతాల్లో వైకాపా ప్రభుత్వ హయాంలో ప్లానుకు విరుద్ధంగా, ప్లాను లేకుండా ఇళ్లు నిర్మించారు.

నాయకులు హామీ అమలు చేయాలి



కాకుమానువారి వీధిలో కాలువలు నిర్మించకపోవడంతో ఇళ్లల్లో వాడుక నీరు బయటకు పోయే మార్గం కనిపించడం లేదు. మురుగు మధ్య ఆవాసాల్లోనే అవస్థలు పడుతున్నాం. తాగునీటి కుళాయిలు బిగించలేదు. వసతులు కల్పించకుండా ఇళ్ల పన్నులు ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. గతంలో నాయకులు ఇచ్చిన హామీని అమలు చేయాలి.

-పున్నయ్య, ఐతానగర్

రూ.1,200 కోట్లతో గిరిజన గ్రామాల్లో మౌలిక వసతులు



మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి, వేదికపై కన్నబాబు, సదా భార్గవి తదితరులు

ఎ.ఎన్.యు, న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యాప్తంగా గిరిజన గ్రామాల్లో రూ.1,200 కోట్లతో పెద్ద ఎత్తున మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నట్లు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి చెప్పారు. గుంటూరు జిల్లాలోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో మంగళవారం ధాత్రి అబా జంజాతీయ ఉత్కర్ష అభియాన్ పేరుతో గిరిజన సంక్షేమ శాఖ అధికారులకు ఒక రోజు కార్యశాల నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి సంధ్యారాణి మాట్లాడుతూ గత వైకాపా హయాంలో ఐటీడీఏలు నామమాత్రంగా పనిచేశాయని విమర్శించారు. ఐటీడీఏలకు వివిధ పనులకు వచ్చే గిరిజనుల కోసం ప్రత్యేకంగా అన్న క్యాంటీన్లను త్వరలో ఏర్పాటు చేస్తామన్నారు. గిరిజన సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి కన్నబాబు , గిరిజన సంక్షేమ శాఖ సంచాలకులు సదా భార్గవి మాట్లాడారు.

ఎస్‌హెచ్‌జీ సభ్యురాలు సుల్తానకు అభినందన



నిగర సుల్తానకు పుష్పగుచ్ఛం ఇస్తున్న మెప్మా మిషన్ సంచాలకులు తేజ్‌భరత్

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: ఇటీవల విజయనగరంలో అఖిల భారత సారస్ (సేల్ ఆఫ్ ఆర్టికల్స్ ఆఫ్ రూరల్ ఆర్టీషియన్స్) ప్రదర్శన నిర్వహించారు. ఇందులో పట్టణ పేదరిక నిర్మూలనా సంస్థకు చెందిన 47 స్వయం సహాయ సంఘాల మహిళా గ్రూపు సభ్యులు 28 స్టాళ్లలో తమ ఉత్పత్తుల అమ్మకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.45.73 లక్షల ఉత్పత్తులు అమ్ముడుపోగా రూ.9.14 లక్షల లాభం వచ్చింది. తెనాలి పినపాడుకు చెందిన ఎస్‌హెచ్‌జీ సభ్యురాలు సయ్యద్ నిగరా సుల్తాన తయారు చేసిన క్రిస్టల్ సంచులు, కృత్రిమ బంగారు ఉత్పత్తులు అత్యధికంగా అమ్ముడయ్యాయి. ఈ సందర్భంగా మంగళవారం తాడేపల్లి మెప్మా ప్రధాన కార్యాలయంలో మెప్మా మిషన్ సంచాలకులు ఎన్.తేజ్ భరత్ సుల్తానకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. ఈ వివరాలను మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న తెలిపారు

25, 26 తేదీల్లో ఎన్ఐఆర్ఎఫ్ కమిటీ పర్యటన

ఎ.ఎన్.యు, న్యూస్‌టుడే: నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్(ఎన్ఐఆర్ఎఫ్) ఎక్స్‌పర్ట్ కమిటీ ఈనెల 25, 26 తేదీల్లో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో పర్యటిస్తోందని రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం తెలిపారు. కమిటీ పర్యటించే రెండు రోజులు బోధన, బోధనేతర సిబ్బంది అందుబాటులో ఉండాలని ప్రకటనలో వెల్లడించారు. కమిటీ అడిగే సమాచారం అందరూ సిద్ధం చేసుకోవాలన్నారు. ఈ రెండు రోజులు సిబ్బంది అనుమతి లేకుండా సెలవులు పెట్టవద్దని రిజిస్ట్రార్ స్పష్టం చేశారు.

ఏఎన్‌యూలో అంతర్ కళాశాలల బాస్కెట్ బాల్ పోటీలు

ఎ.ఎన్.యు, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో మంగళవారం అంతర్ కళాశాలల పురుషుల బాస్కెట్ బాల్ పోటీలు నిర్వహించారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య స్వరూపారాణి ఈ పోటీలను ప్రారంభించారు. మొత్తం 8 కళాశాలల జట్లు పాల్గొనగా నాలుగు జట్లు లీగ్ దశకు చేరుకున్నాయి. ఈ కార్యక్రమంలో వ్యాయామ కళాశాల సంచాలకులు ఆచార్య పాల్‌కుమార్, డాక్టర్ సూర్య నారాయణ, డాక్టర్ ప్రీతం ప్రకాశ్, ఏడుకొండలు, హనుమయ్య తదితరులు పాల్గొన్నారు.

జాతీయ జూనియర్ అథ్లెటిక్స్‌కు అర్హత సాధించిన క్రీడాకారులు

ఎ.ఎన్.యు, న్యూస్‌టుడే: ఏఎన్‌యూలో ఇటీవలే జరిగిన 35వ సౌత్ జోన్ అథ్లెటిక్ ఛాంపియన్ షిప్ పోటీలలో పతకాలు సాధించిన ఆరుగురు క్రీడాకారులను భువనేశ్వర్‌లో ఈనెల 25నుంచి 29 వరకు జరగనున్న 39వ జాతీయ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొననున్నారు. అండర్ -20 పురుషుల విభాగంలో షేక్ రోషన్, అండర్ -18 పురుషుల విభాగంలో షేక్ హమీద్, సుబ్రహ్మణ్యం, అండర్ -16 బాలుర విభాగంలో ధనుష్‌తేజ, అండర్ -16బాలికల విభాగంలో ఎండీ అష్వ, వర్షిణి ఎంపికయ్యారని వ్యాయామ కళాశాల సంచాలకులు ఆచార్య పాల్‌కుమార్ చెప్పారు. పతకాలు సాధించిన వారిని ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య గంగాధర్, రెక్టార్ ఆచార్య రత్నషీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం అభినందించారు.

హ్యాండ్ బాల్ పోటీలకు విద్యార్థులు

నారాకోడూరు (చేబ్రోలు), న్యూస్‌టుడే: హ్యాండ్‌బాల్ జిల్లా జట్టుకు నారాకోడూరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు ఎంపికయ్యారని వ్యాయామ ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావు, ఉమామహేశ్వరి, శరత్ కుమార్ తెలిపారు. అండర్ 14 విభాగంలో 9వ తరగతి విద్యార్థులు హరీష్, అనీల్, బషీర్, చార్లెస్ వెస్లీ, జాన్ వెస్లీ, క్రాంతి, 8వ తరగతి విద్యార్థి కార్తీక్ ఎంపికయ్యారన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 26 నుంచి 28 వరకు తెనాలిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. మంగళవారం విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఏడు కొండలు అభినందనలు తెలిపారు.

బేస్ బాల్ పోటీల్లో దొప్పలపూడి విద్యార్థుల ప్రతిభ

పొన్నూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీలకు గుంటూరు జిల్లా జట్టుకు దొప్పలపూడి హైస్కూల్ చెందిన 10వ తరగతి విద్యార్థి పులిపాటి సాయిబార్గవ్, 8వ తరగతి విద్యార్థి గోళ్ళమూడి ఆదిత్య, 7వ తరగతి విద్యార్థినులు చలంచర్ల షారోన్ కుమారి, దేవరపల్లి విజయలక్ష్మి ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయురాలు పల్లెకోన సునీత లత మంగళవారం వెల్లడించారు. నవంబరు నెల 8,9,10 తేదీలో చిత్తూరు జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా జట్టు తరపున క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు.

ఆదమరిస్తే.. అంతే!



గోళ్లమూడి గ్రామం నుంచి ఉప్పలపాడుకు వెళ్లే అర్‌అండ్‌బీ రోడ్డు అంచులో ఇటీవల వరదల కారణంగా నాలుగు అడుగుల లోతు గుంత ఏర్పడింది. నిత్యం అటుగా వీవీఐటీ కళాశాల బస్సులు, నంబూరు, గోళ్లమూడి, ఉప్పలపాడు గ్రామస్థులు వాహనాలపై రాకపోకలు సాగిస్తుంటారు. రోజులు గడుస్తున్నా గుంతను పూడ్చకపోవడంతో అటుగా రాకపోకలు సాగిస్తున్న వాహనదారులు భయడుతున్నారు. ప్రమాదాలు జరగకముందే అధికారులు మరమ్మతులు నిర్వహించాలని వారు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, పెదకాకాని

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తెనాలి : 80085 73125 పొన్నూరు : 80085 73144

? నందులపేట శ్రీవినాయక గుడి వీధిలో నివాస గృహాల నడుమ ఖాళీ స్థలం పిచ్చి చెట్లు విపరీతంగా పెరగడంతో పాములు, పురుగులు చేరి ఇళ్లలోకి వస్తున్నాయి. – స్థానికులు

✔ స్థల యజమానితో మాట్లాడి సమస్య పరిష్కార చర్యలు తీసుకుంటాం.

? 14వ వార్డు రాము హోటల్ ఎదురు రోడ్డులో, సింగ్‌నగర్ నాజరుపేటలో వీధి దీపాలు కొని నెలలుగా వెలగడం లేదు. చీకటి వల్ల రాకపోకలకు ఇబ్బంది పడుతున్నాం.

– మస్తాన్, 14వ వార్డు, స్థానికులు, నాజరుపేట

✔ సత్వరం మరమ్మతులు చేయిస్తాం.

(పై ప్రశ్నలకు పురపాలక కమిషనర్ బి.శేషన్న సమాధానాలు ఇచ్చారు) - న్యూస్‌టుడే, తెనాలి టౌన్

చెత్త తొలగింపు

స్పందనకు వందనం

మేమున్నాం... మీకు తోడుగా శీర్షికన ఈనాడులో ప్రచురితమైన కథనానికి ప్రజారోగ్యశాఖాధికారులు స్పందించారు. జీబీసీ రహదారిలో మూడు రోజులు నుంచి పేరుకుపోయిన చెత్తను తొలగించారు.

-న్యూస్‌టుడే, పొన్నూరు

ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక



శివ, సాయి

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: ఏఐఎస్ఎఫ్ తెనాలి నియోజకవర్గ నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా గండు శివ, చెన్నూరీ సాయి ఎన్నికయ్యారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సంఘం నియోజకవర్గ నిర్మాణ సభలో ఈ ఎన్నికను నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు పాశం వెంకటేష్ మాట్లాడుతూ ఈనెల 25,26 తేదీలలో గుంటూరులో జరిగే సంఘం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరారు.

సామూహిక ఎలుకల నిర్మూలనపై అవగాహన

పొలం పిలుస్తోందిలో భాగంగా మంగళవారం తెనాలి, పొన్నూరు నియోజకవర్గాల్లో సామూహిక ఎలుకల నివారణపై వ్యవసాయశాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించారు. ప్రస్తుతం వరి ఈనే దశలో ఉందని, ఎలుకలను నివారించకపోతే దుబ్బులను బలహీనయ్యే అవకాశం ఉందన్నారు. 96పాళ్ల నూకలు, 2 పాళ్ల వేరుశనగ నూనెతో పాటు బ్రోమోడయోలాన్ మందు కలిపి 10గ్రాముల చొప్పున పొట్లాలుగా కట్టి రైతులు సామూహికంగా పొలం గట్లు, ఎలుకలు ఉండే కన్నాల వద్ద ఉంచాలని వారు సూచించారు. -న్యూస్‌టుడే, బృందం

రైతు సంఘ నాయకుడి మృతికి సంతాపం

పొన్నూరు, న్యూస్‌టుడే: పట్టణ పరిధి నిడుబ్రోలుకు చెందిన రైతు సంఘం నాయకుడు కొసరాజు వెంకట రాయుడు (77) మంగళవారం రాత్రి గుండెపోటుతో కన్ను మూశారు. ఆయన ఆచార్య ఎన్.జి రంగా శిష్యుడు. ఉమ్మడి రాష్ట్రంలో ఆగ్రో ఇండస్ట్రీస్ మాజీ డైరెక్టర్‌గా పనిచేశారు. ఆయన మృతి పట్ల కూటమి నేతలు, రైతు సంఘ నాయకులు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు.

న్యాయవాది రాజేంద్రప్రసాద్ మృతికి..

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: కళల కాణాచి తెనాలిలోని మధుర జ్ఞాపకాలలో ఒకటైన నాజర్‌పేటలోని శ్రీ వెంకటేశ్వర సినిమా థియేటర్ యజమాని, న్యాయవాది వుయ్యూరు రాజేంద్రప్రసాద్ ఆకస్మిక మృతి విచారకరమని సీనియర్ హోమియో వైద్యుడు డాక్టర్ వాసిరెడ్డి నాగేశ్వరప్రసాద్ సంతాపం తెలిపారు. సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్, మహాప్రస్థాన సేవా సమితి తెనాలి శాఖ వ్యవస్థాపక అధ్యక్షులుగా విశేష సేవలందించినట్లు ఆయన పేర్కొన్నారు.

విషపు మొక్కలు తిని గొర్రెలు మృతి

కొల్లిపర, నూస్‌టుడే: తూములూరు సమీప వ్యవసాయ క్షేత్రాల్లో విషపు మొక్కలుతిని 12 గొర్రెలు మృతి చెందాయని కొల్లిపర పశువైద్యులు సాయిసతీష్‌రాజు మంగళవారం రాత్రి తెలిపారు. ఆరుగొర్రెలకు మెరుగైన వైద్యసేవలు అందించడంతో కోలుకున్నాయన్నారు.

రోడ్డెక్కిన ఈ-ఆటోలు

ఈనాడు కథనానికి స్పందన

పొన్నూరు, న్యూస్‌టుడే: గత వైకాపా పరిపాలనలో ఆరు ఈ-ఆటోలను గత ఏడాది జూన్ నెలలో పొన్నూరు పురపాలక సంఘానికి కేటాయించారు. వాటిలో సాంకేతిక పరమైన సమస్యలు రావడంతో గత ఏడాది సెప్టెంబరులో ఒక్కొక్కటిగా మూలకు చేరాయి. అప్పటి ప్రజారోగ్య శాఖాధికారులు మరమ్మతులు నిర్వహించకుండా వాటిని పక్కన పడేశారు. ఈ ఏడాది సెప్టెంబరు 13వ తేదీన 'మాటలు చెప్పారు... మబ్బ్య పెట్టారు' శీర్షికతో కథనం ప్రచురితమైంది. పురపాలక సంఘ కమిషనర్ ముప్పాళ్ల రమేష్ బాబు స్పందించారు. కమిషనర్ ఆదేశాలతో పాడైపోయిన ఆరు ఈ-ఆటోలు రోడ్డు ఎక్కి చెత్తను తరలిస్తున్నాయి.

చిన్నారిని అపహరించిన నిందితుడి అరెస్టు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: రెండు సంవత్సరాల పాపను దుండగుడు ఎత్తుకెళ్లగా, నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు కుటుంబ సభ్యులకు చిన్నారిని అప్పగించారు. తెనాలి త్రీ టౌన్ పోలీసుల కథనం ప్రకారం.. లక్ష్మీ, గోపాల్ దంపతులు కాగితాలు ఏరుకుంటూ, యాచన చేసుకుంటూ రాత్రి సమయంలో పట్టణంలోని కొత్త వంతెన సమీపంలో రోడ్డు వెంబడి తమ పిల్లలతో కలిసి నిద్రపోతూ ఉంటారు. ఈ క్రమంలో ఈ నెల 1వ తేదీ అర్ధరాత్రి పట్టణ ఇస్లాంపేటకు చెందిన జబ్బార్, ఈ దంపతుల పక్కన నిద్రపోతున్న రెండు సంవత్సరాల చిన్నారిని ఎత్తుకెళ్లాడు. లక్ష్మీ, గోపాల్ దంపతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీ కెమెరాలు, ఇతర ఆధారాల ద్వారా నిందితుడిని గుర్తించారు. క్యాటరింగ్ పనులు చేసే జబ్బార్ మద్యం తాగుతూ తిరుగుతూ ఉంటాడు. పాపను ఇంటికి తీసుకెళ్లగా కుటుంబ సభ్యులు ఎవరని అడిగితే తెలిసిన వారి పాప అని చెప్పాడు. ఆ పాపను కుటుంబ సభ్యులకు అప్పగిస్తానంటూ పలుమార్లు బయటకు తీసుకెళ్లి చిన్నారిని చూపిస్తూ యాచన చేసుకుని కొన్ని గంటల తర్వాత ఇంటికి తెచ్చే వాడు. తన కోసం పోలీసులు వెతుకుతున్నారన్న సమాచారంతో పాపను తన సోదరుడు బాజికి అప్పగించటంతో అతను పోలీసుల వద్దకు చేర్చాడు. పోలీసులు చిన్నారిని తల్లిదండ్రుల వద్దకు చేర్చి నిందితుడు జబ్బార్‌ను అరెస్ట్ చేశారు.

నేల టపాకాయల తయారీదారులు..

చేబ్రోలు,న్యూస్‌టుడే: అనుమతి లేకుంటా నేల టపాకాయలు తయారు చేయిస్తున్న శేకూరుకు చెందిన బూరగ సైదాను అరెస్టు చేసినట్లు ఎస్సై వెంట కృష్ణ తెలిపారు. నారాకోడూరుకు చెందిన ముప్పవరకు సంజయ్ సారథి పరారీలో ఉన్నాడని తెలిపారు.

కుక్కను బెదించబోయి..

భవనం పైనుంచి పడి యువకుడి దుర్మరణం

శేరిలింగంపల్లి, న్యూస్‌టుడే: తెనాలి ప్రాంతానికి చెందిన గాయాపు సుబ్బారావు చాల ఏళ్ల క్రితం పటాన్‌చెరు నియోజకవర్గం రామచంద్రాపురంలోని జ్యోతినగర్‌లో స్థిరపడ్డాడు. అతని కుమారుడు ఉదయ్‌కిరణ్(22) పెయింటింగ్ పని చేస్తున్నాడు. స్నేహితుడి పుట్టినరోజు సందర్భంగా ఆదివారం రాత్రి చందానగర్‌లోని వీవీ ప్రైడ్ హోటల్‌లో గది తీసుకొని దాదాపు 8 మంది స్నేహితులు కలిసి పార్టీ చేసుకుంటున్నారు. అర్ధరాత్రి సమయంలో గది బయటికి వచ్చిన ఉదయ్‌కు కుక్క ఎదురవడంతో బెదిరిస్తూ దాని వెంట పడ్డాడు. కుక్క తిరిగి ఉదయ్ వెంట పడటంతో హడలెత్తి పోయి పరుగు తీశాడు. ఈ క్రమంలో కిటికీలోకి ఎక్కి కుక్క నుంచి తప్పించుకుందామన్న క్రమంలో అదుపు తప్పి మూడో అంతస్తు నుంచి కింద పడ్డాడు. స్నేహితులు ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా వైద్యులు మృతిచెందినట్లు నిర్ధారించారు. ఈ ఘటనపై చందానగర్ పోలీసులకు సమాచారం ఉన్నా బయటకి రాకుండా జాగ్రత్త వహించినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

రైలు నుంచి జారిపడి..

తెనాలి టౌన్: రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని 30 సంవత్సరాల వయసుగల వ్యక్తి మృతి చెందిన ఘటన మోరంపూడి వద్ద జరిగిందని తెనాలి రైల్వే పోలీసులు మంగళవారం తెలిపారు. మృతుని వద్ద గౌహతి నుంచి కోయంబత్తూరుకు తీసుకున్న టికెట్టు ఉందని, దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.

పీబీఎన్ కళాశాల అవగాహన ఒప్పందం

పొన్నూరు, న్యూస్‌టుడే: నిడుబ్రోలులోని పీబీఎన్ కళాశాల, ఢిల్లీకి చెందిన ఎలక్ట్రానిక్స్ స్కిల్ సెక్టార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాతో అవగాహన ఒప్పందం చేసుకున్నట్లు పీబీఎన్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.శివకుమారి మంగళవారం వెల్లడించారు. అవగాహన పత్రాలను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.శివకుమారి ఎలక్ట్రానిక్స్ స్కిల్ సెక్టార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ సలీం అహ్మద్ మార్చుకున్నారు.

నిర్లక్ష్యం.. ప్రయాణికులకు శాపం

అధ్వానంగా నిడుబ్రోలు రైల్వే వంతెన రహదారి



రైల్వే వంతెన రహదారిపై గోతులు



నడక దారిలో పగుళ్లిచ్చిన శ్లాబు

పొన్నూరు, న్యూస్‌టుడే: వైకాపా పాలనలో నిడుబ్రోలు రైల్వే వంతెన మరమ్మతులకు నిధులు మంజూరు చేయకపోవడంతో ప్రమాదకరంగా మారడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. పొన్నూరు- రేపల్లె ప్రధాన రహదారిలో నిడుబ్రోలు రైల్వే వంతెన ఉంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రహదారి గోతులమయంగా మారింది. ఆ మార్గంలో రాకపోకలు నిర్వహించే సమయంలో వాహనాలు అదుపు తప్పి బోల్తా పడి ప్రమాదాల బారిన పడుతున్నారు.

దెబ్బతిన్న మెట్ల మార్గం.. వంతెనపై రాకపోకలు నిర్వహించే సమయంలో నిడుబ్రోలు ప్రభుత్వ వైద్యశాలకు, రైల్వే స్టేషన్‌కు వెళ్లేందుకు వంతెనకు ఒక వైపు నడిచే వెళ్లేందుకు మెట్ల మార్గం ఉంది. మెట్ల అడుగు భాగంలోని శ్లాబు పెచ్చులుగా రాలిపడుతున్నాయి. సువ్వలు సైతం బయట పడ్డాయి. వంతెన గోడలు అక్కడక్కడ పగుళ్లిచ్చి ప్రమాదకరంగా ఉన్నాయి. కాలి బాట వంతెన కోసం ఏర్పాటు చేసిన దిమ్మెలు పగుళ్లిచ్చి ప్రమాదకరంగా మారాయి.

కాగితాలకే పరిమితం.. వంతెన ప్రమాదకరంగా ఉందని స్థానికులు వైకాపా పరిపాలనలో అనేక సార్లు ఫిర్యాదు చేసినా వాటిని కాగితాలకే పరిమితం చేశారు. రోడ్డు భవనాల శాఖాధికారులు మేల్కొని మరమ్మతులకు నిధులు మంజూరు చేసేలా తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం.. రోడ్డు భవనాల శాఖ సహాయ ఇంజినీర్ గోగినేని శ్రీనివాసరావును న్యూస్‌టుడే వివరణ కోరగా నిడుబ్రోలు రైల్వే వంతెన రహదారి గోతులు పడటంతో వాటి మరమ్మతుల కోసం ప్రతిపాదనలు తయారు చేసి ఉన్నతాధికారులకు పంపామని, నిధులు మంజూరు కాగానే మరమ్మతులను పూర్తి చేసేలా తగు చర్యలు తీసుకుంటామన్నారు.

గుంటూరు తూర్పు

29, 30 తేదీల్లో ప్రభుత్వ ఉద్యోగులకు పోటీలు

గుంటూరు క్రీడలు, న్యూస్‌టుడే: రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈనెల 29, 30 తేదీల్లో జిల్లాలోని ప్రభుత్వ సివిల్ సర్వీసెస్ ఉద్యోగులకు పలు క్రీడాంశాల్లో జిల్లా స్థాయి పోటీలు నిర్వహించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి నరసింహారెడ్డి తెలిపారు. ఎంపికైన వారిని నవంబర్ 6 నుంచి 9వ తేదీ వరకు జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపుతామన్నారు. ఆసక్తి ఉన్నవారు సంబంధిత ధ్రువపత్రాలు, గుర్తింపుకార్డుతో బీఆర్ స్టేడియానికి ఉదయం 9 గంటలకు హాజరుకావాలన్నారు. వివరాలకు 94418 18491 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.



ఎన్టీఆర్ రైతు బజారులో ధరలు నిన్నటివి.. (కిలో రూ.ల్లో) టమాట 38, వంగ 24, బెండ 37, పచ్చిమిర్చి 39, కాకర 30, క్యారెట్ 46, క్యాలీఫ్లవర్ 38, క్యాబేజీ 28, బీర 29, దొండ 26, బంగాళదుంప 39, ఉల్లిపాయలు 38, గోరుచిక్కుళ్లు 28, దోస 34, పొట్ల 32, మునగ 8, పెద్ద చిక్కుళ్లు 74, చామదుంప 36, మునగ రూ.8, గోంగూర 10, తోటకూర 20, కొత్తిమీర 30, బీట్‌రూట్ 33, కీర 24, క్యాప్సికం 64, అల్లం 70, ఫ్రెంచి బీన్స్ 94, సొర 16, అరటి 7.

- న్యూస్‌టుడే, పట్నంబజారు

లాలాపేట.. సమస్యల మేట

పట్నంబజారు, న్యూస్‌టుడే

లాలాపేట పరిసర ప్రాంత ప్రజలు అపరిశుభ్ర వాతావరణంలో జీవనం సాగిస్తున్నారు. లాలాపేట, పెద్ద మసీదు సెంటర్, కింగ్స్ హోటల్ సెంటర్, చౌత్రా సెంటర్ ప్రాంతాల్లో చెత్త కుండీలు శిథిలావస్థకు చేరాయి. పలుమార్లు కార్పొరేషన్ అధికారులకు ఫిర్యాదు చేసినా ఎటువంటి ప్రయోజనం లేదని ఆ ప్రాంత వాసులు చెబుతున్నారు.

ఆ రోడ్లపై నడవటం కష్టమే..: లాలాపేట చుట్టుపక్కల ప్రాంతాల్లో కొద్దిరోజుల కిందట అధికారులు పైపులైన్లు ఏర్పాటు చేశారు. చౌత్రా సెంటర్, లాలాపేట, బారాయిమాంపంజా సెంటర్, మసీదు సెంటర్లల్లో రోడ్లను అభివృద్ధి చేయకుండా డస్ట్‌తో కప్పివేశారు. ఇటీవల కురిసిన వర్షాల తాకిడికి డస్ట్ కొట్టుకుపోయి రోడ్డుపై తవ్వకాలు చేసిన ప్రదేశాల్లో గుంతలు ఏర్పడ్డాయి. వాహనదారులకు తిప్పలు తప్పడం లేదు.


పేరుకుపోయిన వ్యర్థాలు


రోడ్డు తవ్వి డస్ట్ పోసి వదిలేయడంతో..

అధ్వానంగా సైడు కాలువలు

శానిటరీ సిబ్బంది నిత్యం సైడు కాలువల్ని శుభ్రపరచడం లేదు. దీంతో కాలువలు స్తంభించి వ్యర్థపునీరు రోడ్లపైకి చేరుతుంది. కొందరు స్థానికులు ఇళ్లల్లోని మరుగుదొడ్లను సైడు కాలువల్లోకి పైపు లైన్లు ఏర్పాటు చేసి వదిలేశారు. సైడు కాలువల్లో నుంచి వచ్చే దుర్వాసన కారణంగా ఇటుగా రాకపోకలు చేయటం కష్టంగా మారిందని పలువురు వాహనదారులు తెలిపారు.

ఇళ్లల్లో ఉండలేకపోతున్నాం



లాలాపేట పరిసర ప్రాంతాల్లో రోడ్లపై వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. వాటి నుంచి వచ్చే దుర్వాసన కారణంగా ఇళ్లల్లో ఉండలేకపోతున్నాం. వ్యర్థాలను తొలగించి పాడైన డస్ట్ బిన్ స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలి. **- నాగిరెడ్డి**

రోడ్లను అభివృద్ధి చేయాలి



ఇటీవల పైపులైన్ల ఏర్పాటు కోసం అధికారులు రోడ్లను తవ్వి వదిలేశారు. వాహనాల్ని ఇళ్లకు దూరంగా నిలుపుదల చేసి వెళ్తున్నాం. ఇదే అదనుగా గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనాల్ని చోరీ చేస్తున్నారు. అధికారులు రోడ్లను అభివృద్ధి చేయాలి. **- సురేష్**





పరీక్ష రాస్తున్న విద్యార్థులు, విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేస్తున్న జైన్ హైస్కూల్ డైరెక్టర్ మున్ను

ప్రతిభ చాటారు

'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు

పట్నంబజారు, న్యూస్‌టుడే: విద్యార్థులు సమాజంపై అవగాహన పెంపొందించుకోవాలని జైన్ హైస్కూల్ డైరెక్టర్ యం.డి.మున్ను అన్నారు. సంగడిగుంటలోని జైన్ హైస్కూల్‌లో మంగళవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీ పరీక్షలు జరిగాయి. ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు- విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. షేక్ ఖైరున్నీసా, ఈ.కిరణ్‌కుమార్, షేక్ సోహెల్‌లకు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు 'ఈనాడు' సమర్పించిన బహుమతులు, ప్రశంసాపత్రాలను జైన్ హైస్కూల్ డైరెక్టర్ యం.డి.మున్ను అందజేశారు. కార్యక్రమంలో జైన్ హైస్కూల్ ప్రిన్సిపల్ కనకదుర్గ, తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా విక్రయాలకు అనుమతి తప్పనిసరి


ఎస్పీ సతీష్‌కుమార్

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: దీపావళి పండగ సందర్భంగా బాణసంచా తయారీ కేంద్రాలు, నిల్వచేసే గోదాములు, విక్రయించే దుకాణాలకు తప్పనిసరిగా అనుమతులు ఉండాలని జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ తెలిపారు. మంగళవారం ఎస్పీ తన కార్యాలయంలో మాట్లాడుతూ.. బాణసంచా తయారీ, విక్రయాలకు లైసెన్సు కలిగి ఉండాలన్నారు. దుకాణ నిర్వాహకులు.. పోలీసు అధికారులు, అగ్నిమాపకశాఖ వారు సూచించిన నిబంధనలు, జాగ్రత్తలు పాటించాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు. ఎక్కడైనా బాణసంచా అక్రమ నిల్వలు, అమ్మకాల సమాచారాన్ని డయల్ 100, 112, పోలీసు కంట్రోల్ రూం 8688831568కు తెలియజేయాలన్నారు. వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్పీ చెప్పారు.

అర్చక పరీక్షల దరఖాస్తులకు గడువు పెంపు

నెహ్రూనగర్: దేవాదాయశాఖ నిర్వహిస్తున్న ప్రవేశ, వర, ప్రవర, ఆగమ అర్చక పరీక్షలకు దరఖాస్తులకు ఈ నెల 31వ వరకు గడువు పొడిగిస్తూ ఆ శాఖ కమిషనర్ సత్యనారాయణ ఆదేశాలు జారీచేశారని ఏపీ అర్చక ఐక్యవేదిక రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జంధ్యాల వెంకట రామలింగేశ్వరశాస్త్రి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్చక జేఏసీ సంఘం సభ్యులు ఈ నెల 21న కమిషనర్‌ను కలిసి గడువు పెంచాలని విజ్ఞప్తి చేయగా స్పందించిన కమిషనర్ సత్యనారాయణ ఈ నెల 31వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని అర్చకులు వినియోగించుకోవాలని కోరారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

నెహ్రూనగర్: తెనాలికి చెందిన సహానను కారులో తీసుకువెళ్లి దాడి చేసిన ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని సీపీఎం, సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో సహాన తల్లి అరుణను నాయకులు పరామర్శించారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. పరామర్శించిన వారిలో అంగన్‌వాడీ వర్కర్స్ సంఘం జిల్లా అధ్యక్షులు ఏవీఎన్ కుమారి, ఉపాధ్యక్షులు చినవెంకాయమ్మ, నాయకులు భావన్నారాయణ, హుస్సేన్, లక్ష్మణరావు ఉన్నారు


మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్

విశాఖ ప్రైవేటీకరణను వ్యతిరేకించండి

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణను కూటమి ప్రభుత్వం వ్యతిరేకించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం కొత్తపేటలోని కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల హామీల్లో భాగంగా పేద ప్రజలకు ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తామని చెప్పి ఇప్పుడు మెలికపెట్టి దీపం పథకం ఉన్నవారికి మాత్రమే ఇస్తామనడం విడ్డూరంగా ఉందన్నారు. తెల్లరేషన్‌కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాయకులు మాల్యాద్రి, అరుణ్‌కుమార్, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ శంకరన్‌కు నివాళి


శంకరన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న అజయ్‌కుమార్, అరుణ్‌కుమార్ తదితరులు

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఎస్ఆర్ శంకరన్ జయంతి సభ మంగళవారం కొత్తపేటలోని మల్లయ్యలింగంభవన్‌లో నిర్వహించారు. శంకరన్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు అజయ్‌కుమార్, అరుణ్‌కుమార్, సత్యానందం, మాల్యాద్రి, చైతన్య, మరియదాసు, వెంకటేశ్వరరావు, చిన్నబాబు పాల్గొన్నారు.

ఇంటర్ బోర్డు విశ్రాంత ఉద్యోగుల విరాళం


పట్టాభిపురం, న్యూస్‌టుడే: వరద బాధితుల సహాయార్థం ఇంటర్ బోర్డు విశ్రాంత ఉద్యోగులు విరాళం అందజేశారు. మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ సమక్షంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు సచివాలయంలో రూ.1,98,000 చెక్కును మనోహర్‌రెడ్డి, రమేష్, ప్రకాశరావు, పుండరీకాక్షులు అందజేశారు.

బోధన నైపుణ్యాలు పెంపొందించుకోవాలి


మాట్లాడుతున్న పాఠశాల విద్య ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి

నగరపాలక సంస్థ(గుంటూరు), న్యూస్‌టుడే: విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు ఉపాధ్యాయులు బోధన నైపుణ్యాలు పెంపొందించుకోవాలని పాఠశాల విద్య ఆర్జేడీ డి.లింగేశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం పెదపరిమిలోని మొవ్వ చినబాపిరెడ్డి ఛారిటబుల్ ట్రస్ట్ భవనంలో 1, 2 తరగతుల ఉపాధ్యాయులకు బోధన నైపుణ్యాలపై జరుగుతున్న శిక్షణకు ఆయన హాజరయ్యారు. డీఈవో పి.శైలజ, డైట్ ప్రిన్సిపల్ డాక్టర్ షేక్ సలీం బాషా, సమగ్ర శిక్ష ఏపీసీ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలు క్రమబద్ధీకరించాలని వినతి


ఎమ్మెల్యే నసీర్‌కు వినతిపత్రం ఇస్తున్న రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఉద్యోగులు

నగరపాలక సంస్థ(గుంటూరు), న్యూస్‌టుడే: రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులను ప్రభుత్వం క్రమబద్ధీకరించి వివిధ శాఖల్లో విలీనం చేయాలని ఉద్యోగుల సంఘం ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అలీ కోరారు. మంగళవారం ఎమ్మెల్యే నసీర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఇటీవల మణిపూర్‌లో ఈ సంస్థ ఉద్యోగులను క్రమబద్ధీకరించిన విషయం ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారని పేర్కొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన కార్పొరేటర్లు

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ సమక్షంలో ఇటీవల జనసేనలో చేరిన గుంటూరు నగరానికి చెందిన కార్పొరేటర్లు ఆయుబ్ఖాన్, కనకదుర్గ శ్రీనివాస్, ఇర్ఫాన్, సంకూరి శ్రీనివాసరావు మంగళవారం గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువకప్పి పుష్పగుచ్ఛం అందించారు.

సాంకేతిక పరిజ్ఞానంతో నేరాల కట్టడి

గుంటూరు రేంజ్ ఐజీ త్రిపాఠి ఆదేశాలు


ఎస్పీలతో మాట్లాడుతున్న ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి

ఈనాడు, అమరావతి: సాంకేతిక పరిజ్ఞానంతో నేరాలు అదుపుచేసే వ్యూహాలను గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి పిలుపునిచ్చారు. కేసుల దర్యాప్తులో సాంకేతికతను జోడిస్తే ఫలితాలు వేగంగా ఉంటాయని చెప్పారు. ఇటీవల బాపట్ల జిల్లా మేదరమెట్ల స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఓ దారిదోపిడీ కేసులో 48 గంటల్లో ఛేదించడానికి ఆ పరిజ్ఞానమే దోహదపడిందన్నారు. మంగళవారం సాయంత్రం రేంజ్ పరిధిలోని గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాల ఎస్పీలతో ఆయన గుంటూరులోని తన ఛాంబర్‌లో సమీక్షించారు. తెదేపా కేంద్ర కార్యాలయం, చంద్రబాబునాయుడు నివాసంపై గతంలో జరిగిన దాడుల కేసుల పురోగతి, ఆధారాలు ఎలా సేకరించింది ఎస్పీలను వివరించారు. రఘురామకృష్ణరాజు కేసు పురోగతిపైనా చర్చించారు. ఎస్పీలు సతీష్‌కుమార్, ఎ.ఆర్.దామోదర్, తుషార్ డూడీ, శ్రీనివాసరావు, కృష్ణకాంత్ పాల్గొన్నారు. ఐజీ చేసిన సూచనలు..

- ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో సీసీ కెమెరాలతో గట్టి నిఘా ఏర్పాటు చేసుకోవాలి. ఎక్కడ ఏ నేరం జరిగినా వెంటనే సీసీ కెమెరాల ద్వారా గుర్తించే అవకాశం ఉండాలి.
- గతంలో మాదిరి ప్రతీ కానిస్టేబుల్‌కు ఓక ప్రాంతాన్ని దత్తత ఇచ్చి అక్కడ ఏం జరిగినా సమాచారం వచ్చేలా చూడాలి.
- రెగ్యులర్ కేసులను పర్యవేక్షిస్తూనే వాటి పెండెన్సీని చాలా వరకు తగ్గించాలి.
- రౌడీషీటర్లు, పాత నేరస్థుల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాలి. ప్రతి వారం కౌన్సెలింగ్ చేస్తూ వారి కదలికల్ని తెలుసుకోవాలి.
- సామాజిక మాధ్యమాల్లో పోస్టింగులు పెట్టి విద్వేషాలు రెచ్చగొట్టేవారిని కట్టడి చేయాలి. బాధ్యులను పిలిచి మాట్లాడాలి. రెండోసారి పునరావృతమైతే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించాలి.
- సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించే దుకు ఏర్పాట్లు చేయాలి.
- గంజాయి, ఇతర మత్తు పదార్థాల విక్రయాలకు తావులేకుండా అక్కడికక్కడే అణచివేయాలి. వాటి పర్యవసానాలపై కళాశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలి.

సాంకేతిక విధానాలతో భూసర్వే వేగవంతం


కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌తో కమిషనర్ శ్రీనివాసులు తదితరులు

నగరపాలకసంస్థ(గుంటూరు), న్యూస్‌టుడే: ఆధునిక సాంకేతిక విధానాలతో భూసర్వే వేగవంతంగా చేసేందుకు వీలుంటుందని కమిషనర్ శ్రీనివాసులు తెలిపారు. ఢిల్లీలో ఉండే స్థూర్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో రెండు రోజులపాటు జరిగే సదస్సులో ప్రణాళిక, సర్వే అధికారులతో కలిసి మంగళవారం ఆయన హాజరయ్యారు. కమిషనర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ భూవనరుల, గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఉద్వర్యంలో నేషనల్ జియో స్పేషియల్ నాలెడ్జ్ - పట్టణ నివాసాల ఆధారిత భూమి సర్వే విధానాలు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సర్వే విధానంలో అత్యాధునిక డ్రోన్‌లు, జీఐఎస్ సాంకేతిక వినియోగం ద్వారా రికార్డుల భద్రపరచడం వంటి అంశాలను వివరించినట్లు తెలిపారు. సర్వే ల్యాండ్ రికార్డు రాష్ట్ర డైరెక్టర్ వి.శ్రీకేష్ లఠ్కర్ వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కమిషనర్లు పాల్గొన్నారని తెలిపారు.

- సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన కేంద్ర గ్రామీణాభివృద్ధి, టెలీకమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌ను సదస్సు అనంతరం కమిషనర్ పి.శ్రీనివాసులు కలిశారు. ఈ సందర్భంగా మంత్రి సదస్సులో వర్చించిన అంశాలు గురించి తెలుసుకుని, క్షేత్రస్థాయిలో అమలుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

ముఠుగు.. జనం బేజారు

చౌత్రా సెంటర్‌కు వెళ్లే దారి అధ్వానంగా మారింది. ఈ ప్రాంతంలో డ్రైనేజీ లీకై వ్యర్థపు నీరు రోడ్డుపై ప్రవహిస్తున్నా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. పాన్నూరురోడ్డు వైపు నుంచి చౌత్రా సెంటర్‌కు వెళ్లే వాహనదారులు ఇటుగా రాకపోకలు కొనసాగిస్తుంటారు. రోడ్డుపై చేరిన వ్యర్థపు నీటి కారణంగా స్థానికులు రోగాల బారిన పడుతున్నారు. నగర నడిబొడ్డున ప్రధాన రహదారిలో డ్రైనేజీ లీకై అయి రోజులు గడుస్తున్నా అధికారులు స్పందించ పోవడం ఏంటని వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, పట్నంబజారు



పొట్టి శ్రీరాములునగర్‌లో చోరీ

పట్టాభిపురం, న్యూస్‌టుడే: పొట్టి శ్రీరాములునగర్‌లో చోరీ జరిగినట్లు అరండల్‌పేట స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. ఎల్ఐసీ ఖ్లబ్‌లో పని చేస్తున్న సుబ్బారావు పొట్టి శ్రీరాములునగర్ ఆరోలైనులో నివాసం ఉంటున్నారు. ఆయన మంగళవారం భోజనం చేసి తిరిగి క్లబ్‌కు వెళ్లారు. భార్య బజార్‌కు వెళ్లారు. ఇది గమనించిన దొంగ ఇంటి తలుపుల దగ్గరకు చేరి తలుపు ప్రవేశించాడు. బీరువాలో ఉన్న బంగారు ఆభరణాలను అపహరించుకుపోయాడు. భార్య ఇంటికి వచ్చాక దొంగతనం జరిగినట్లు గ్రహించి విషయాన్ని భర్త సుబ్బారావుకు తెలిపారు. ఆయన అరండల్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బంగారం వ్యాపారిని దోచిన నిందితుల అరెస్టు

రూ.39 లక్షల నగదు స్వాధీనం

బాపట్ల, న్యూస్‌టుడే: జాతీయ రహదారిపై మేదరమెట్ల వద్ద బంగారం వ్యాపారి స్వరూప్ కుమార్ నుంచి నగదు దోచిన నలుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.39 లక్షల నగదు, కారు, టార్పలిన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు బాపట్ల ఎస్పీ తుషార్ డూడీ తెలిపారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలు వెల్లడించారు. ఉయ్యూరు మండలం కాటూరుకు చెందిన దరకొండ వెంకన్నస్వామి గతంలో లారీ డ్రైవర్‌గా పని చేసేవాడు. అదే గ్రామానికి చెందిన అతని స్నేహితులు పగడాల మహేష్ కార్పెంటర్, బెంటు కార్తీక్, ఫూరేటి శివ శ్రీనివాసరావు వెల్డింగ్ పనులు చేస్తూ జీవిస్తున్నారు. వెంకన్న స్వామి తల్లి మూత్రపిండాల వ్యాధితో బాధపడుతుంది. ఆమె చికిత్స కోసం తగినంత నగదు సమకూర్చుకునేందుకు సులువైన మార్గంలో సంపాదించాలని భావించి స్నేహితులతో కలిసి చోరీ చేయాలని నిర్ణయించారు. వెంకన్నస్వామి గతంలో ఓ ప్రైవేటు ట్రావెల్స్‌లో డ్రైవర్‌గా పని చేస్తూ విజయవాడ నుంచి చెన్నై వరకు లారీ నడిపాడు. ఆ సమయంలో గుంటూరు, బిల్ కలరిపేట, పలువురు ప్రాంతానికి చెందిన బంగారు వ్యాపారులు చెన్నైలో బంగారం కొనుగోలుకు భారీ మొత్తం నగదుతో వెళ్లేవారు. అలా ఏర్పడిన లారీని ఆపి వ్యాపారులను బెదిరించి దొంగతనాలకు పాల్పడాలని ఆనందించారు. ఈ నెల 18న రాత్రి విజయవాడలో ప్రైవేటు ట్రావెల్స్‌లో కారు అద్దెకు తీసుకుని నలుగురు స్టేషను నుంచి విజయవాడ నుంచి ఓ లారీని అనుసరించారు. గుంటూరు సమీపంలో వ్యాపారి స్వరూప్ కుమార్ నోట్ల కట్టలు నింపుకున్న లారీ ఎక్కడం గమనించారు. ప్రణాళిక ప్రకారం మేదరమెట్ల వద్ద ఎన్‌హెచ్ 16 సమీపంలో వెంబడించి కొంత దూరం వెళ్లాక లారీకి కారు అడ్డు పెట్టి జీఎస్టీ అధికారులమని చెప్పి లారీ డ్రైవర్, వ్యాపారిని బెదిరించారు. వ్యాపారి కొట్టి లారీ నడిపి వ్యాపారి నగదు తీసుకుని పరారయ్యారు. ఈ విషయం ఎవరికైనా చెబితే చంపేస్తామని బెదిరించి నిందితులు పరారయ్యారు. బాధితుడు మరుసటి రోజు మేదరమెట్ల పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్పీ వెంటనే స్పందించి చీరాల డీఎస్పీ జగదీష్ నాయక్ నేతృత్వంలో నాలుగు ప్రత్యేక బృందాలు ఎన్‌హెచ్-16 టోల్‌ప్లాజా వద్ద సీసీ కెమెరాల పరిశీలించి నలుగురు నిందితులను అరెస్టు చేశారు.

గుంటూరు పశ్చిమ

సిద్ధాంతపర రాజకీయాలు చేయడంలో నేతలు విఫలం

మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు



యలమంచిలి శివాజీతో మాట్లాడుతున్న వెంకయ్యనాయుడు

గుంటూరు(పట్టాభిపురం), న్యూస్‌టుడే: సిద్ధాంతపరంగా రాజకీయాలు చేయడంలో నేతలు పూర్తిగా విఫలమయ్యారని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు తెలిపారు. ఇటీవల హైదరాబాద్‌లో గొంతు శస్త్ర చికిత్స చేయించుకున్న రాజ్యసభ మాజీ సభ్యుడు, రైతు నాయకుడు డాక్టర్ యలమంచిలి శివాజీని గుంటూరులోని నివాసంలో ఆయన పరామర్శించారు. వెంకయ్యనాయుడు మాట్లాడుతూ 'శివాజీ నాకు సీనియర్. ఇద్దరం కలిసి చాలా ప్రజా ఉద్యమాల్లో పాల్గొన్నాం. రాజకీయాల నుంచి మంచి పేరుతో బయటకు రావడం చాలా అరుదు. నేడు ఆశ కాశం, కులం, డబ్బుతో రాజకీయాలు చేస్తున్నారు. ఎన్నికల కోసం రూ.కోట్లు ఖర్చు పెట్టడం దారుణం. నా రాజకీయ జీవితంలో ఎప్పుడూ నా జేబులో నుంచి రూ.10 కూడా ఖర్చు చేయలేదు. ఒకప్పుడు ప్రజలే డబ్బులిచ్చి రాజకీయాలు చేయిస్తే.. నేడు నాయకులు డబ్బులు పెట్టి చేస్తున్నారు. రాజకీయాల్లో పెనుమార్పులు రావాలని కోరుకుంటున్నా. ప్రచార సాధనాలు కూడా చైతన్యాన్ని ప్రదర్శించడం లేదు. సమాచారం కచ్చితంగా ఉంటే ఆదారం కచ్చితత్వం ఉంటుంది. పత్రికలకు స్వేచ్ఛ ఉండాలి. సత్యానికి దగ్గరగా ఉండేలా విశ్వసనీయతతో నడపాలి. రాజకీయాలు, ప్రచార సాధనాలు నిష్పక్షపాతంగా ఉంటేనే న్యాయం గెలుస్తుంది. గత ఎన్నికల సమయంలో బూతులు మాట్లాడిన ఏ ఒక్కరూ గెలవకపోవడం అందరం చూశాం. యువత విదేశాల్లో ఉన్నత చదువులు చదివి తిరిగి భారత్‌కు వచ్చి గ్రామాలను అభివృద్ధి పథంలో నడపాలి' అని పిలుపునిచ్చారు. గుంటూరులో యూజీడీ పనులు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారని, కార్పొరేషన్‌కు రూ.లక్షలు ఖర్చయ్యాయని శివాజీ ఆయన దృష్టికి తీసుకెళ్లారు. గుంటూరులో యూజీడీ కోసం రూ.500 కోట్లు మంజూరు చేశామని, గుత్తేదారులు, ప్రజాప్రతినిధులు, అధికారులు అందరూ కలిసి నిర్వీర్యమైపోయిందని వెంకయ్యనాయుడు పేర్కొన్నారు.

ప్రతిభకు ప్రోత్సాహం.. పోటీల్లో ఉత్సాహం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న విష్ణువర్ధన్, కృష్ణవేణి, పద్మజ

పట్టాభిపురం, న్యూస్‌టుడే: లక్ష్మీపురంలోని పాటిబండ్ల సీతారామయ్య స్వీపీడీ పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో జరిగిన ప్రతిభా పాటవ పోటీలకు విశేష స్పందన లభించింది. 'అంతర్జాలం వినియోగంతో లాభనష్టాలు-విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశంపై వ్యాసరచన పోటీలు మంగళవారం నిర్వహించారు. 8, 9, 10 తరగతి విద్యార్థులు పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. జయ కృష్ణ(తొమ్మిదో తరగతి) ప్రథమ, కె.వి.ఎస్.చరణ్ ద్వితీయ, భవ్య తన్మయ(ఎనిమిదో తరగతి) తృతీయ స్థానాలు సాధించారు. విజేతలకు పాఠశాల కార్యదర్శి పాటిబండ్ల విష్ణువర్ధన్, అకడమిక్ డైరెక్టర్ కృష్ణవేణి, ప్రిన్సిపల్ పద్మజ బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు.

నారాయణ పాఠశాలలో..

పట్టాభిపురం, న్యూస్‌టుడే: పట్టాభిపురంలోని నారాయణ పబ్లిక్ పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో జరిగిన ప్రతిభా పాటవ పోటీలకు అనూహ్య స్పందన లభించింది. 'అంతర్జాలం వినియోగంతో లాభనష్టాలు-విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశంపై వ్యాసరచన పోటీలు మంగళవారం నిర్వహించారు. 8, 9, 10 తరగతి విద్యార్థులు పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. శ్రీజ ప్రథమ, సౌనాలి ద్వితీయ, తనుశ్రీ తృతీయ స్థానాలు సాధించారు. విజేతలకు ప్రిన్సిపల్ వెంకటేశ్వరరావు, డీన్ శ్రీనివాసరావు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డీజీఎం శ్రీనివాసులురెడ్డి, ఏజీఎం పోతురాజు తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేసిన వెంకటేశ్వరరావు

తెనాలిలో 8.8 మి.మీ వర్షపాతం

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: జిల్లాలో సోమవారం ఉదయం నుంచి మంగళవారం ఉదయం వరకు సగటున 1.3 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. తెనాలి మండలంలో 8.8 మిల్లీ మీటర్ల వర్షం కురియగా.. పొన్నూరు 7.2, కొల్లిపర 6.2, కాకుమాను 2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

ఇంటర్ బోర్డు విశ్రాంత ఉద్యోగుల విరాళం



పట్టాభిపురం, న్యూస్‌టుడే: వరద బాధితుల సహాయార్థం ఇంటర్ బోర్డు విశ్రాంత ఉద్యోగులు విరాళం అందజేశారు. మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ సమక్షంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు సచివాలయంలో రూ.1,98,000 చెక్కును మనోహర్‌రెడ్డి, రమేష్, ప్రకాశరావు, పుండరీకాక్షులు అందజేశారు.

దారులు అధ్వానం.. వసతులు శూన్యం



పిల్లల పాఠశాల దగ్గర రహదారి పక్కన చెత్త



ఖాళీ స్థలంలో పెరిగిన జమ్ము

ఏటి అగ్రహారం, న్యూస్‌టుడే

నగరంలోని 28వ డివిజన్‌లోని పలు కాలనీల్లో కనీస వసతులు మృగ్యమయ్యాయి. రోడ్లు, డ్రెయినేజీ సౌకర్యం సక్రమంగా లేకపోగా.. వీధి దీపాలు, కుక్కల బెడద వంటి సమస్యలు వెంటాడుతున్నాయి. ఈ డివిజన్‌లో హౌసింగ్‌బోర్డు కాలనీ, ఎన్జీవో కాలనీ, నేతాజీనగర్, బజారానగర్, వెంకటరమణకాలనీ, సీతమ్మకాలనీ ప్రాంతాలు ఉన్నాయి. పన్నులు కడుతున్నా సరైన మౌలిక సదుపాయాలు కల్పించడం లేదని ఆయా కాలనీల ప్రజలు వాపోతున్నారు. హౌసింగ్‌బోర్డు ఎక్స్‌టెన్షన్ ప్రాంతంలో దాదాపు 500 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. అందులో 10 అపార్ట్‌మెంట్లు, విల్లాస్ ఉన్నాయి. సంపన్నులు, అధికారులు, మధ్య తరగతి ప్రజలు ఎక్కువగా నివాసం ఉంటున్నారు. అలాగని కాలనీలో మౌలిక వసతులు బాగుంటాయని.. సమస్యలు ఉండవనుకుంటే పొరపాటే. ఏళ్లు గడుస్తున్నా అధ్వానంగా ఉన్న రోడ్డుపైనే ప్రయాణించాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు. రాత్రి వేళ గుంతలు కనిపించక రాకపోకలకు నానా అవస్థలు పడుతున్నారు. వర్షాకాలమైతే ఇళ్లలోంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొంటుందని, గత అయిదేళ్లూ రోడ్లు చిన్నపాటి మరమ్మతులు కూడా నోచుకోలేదని స్థానికులు చెబుతున్నారు.

ఎక్కడెక్కడ ఏయే సమస్యలంటే..

★ సైడ్ కాలువలు లేకపోవడంతో మురుగు నీరంతా ఖాళీ స్థలాల్లో తిష్ఠ వేస్తుంది. మురుగు నిల్వ ఉండడంతో దుర్వాసనతో పాటు దోమల కారణంగా వ్యాధుల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురుగునీటి పారుదల వ్యవస్థ అధ్వానంగా ఉంది.

★ సీతమ్మకాలనీ, వెంకటరమణ కాలనీ, హౌసింగ్ బోర్డు తదితర ప్రాంతాల్లో వీధి దీపాల సమస్య వెంటాడుతోంది. ★ ఎన్జీవో కాలనీ, నల్లకుంట ప్రాంతాల్లో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. ★ హౌసింగ్ బోర్డు 3వ లైన్, ఎక్స్‌టెన్షన్ దగ్గర ఎక్కడ చూసినా చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. ఖాళీ స్థలాలు ఎక్కువగా ఉండడంతో దోమలకు, పాములకు ఆ ప్రాంతం ఆవాసంగా మారింది. వాన నీరు ఖాళీ స్థలాల్లో నిలుస్తోంది. దీంతో వాటిలో జమ్ము, పిచ్చిమొక్కలు, కంప చెట్లు పెరిగాయి. రాత్రి వేళల్లో విషపురుగులు, సర్పాలు తిరుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



హౌసింగ్‌బోర్డు ఎక్స్‌టెన్షన్ రహదారి దుస్థితి

పలు రైళ్ల రద్దు


గుంటూరు రైల్వే, న్యూస్‌టుడే: తుపాను కారణంగా గుంటూరు మీదుగా వెళ్లే పలు రైళ్లను రద్దు చేసినట్లు మండల రైల్వే అధికారి తెలిపారు. ఈనెల 23న సికింద్రాబాద్-భువనేశ్వర్(17016), సిల్చార్-సికింద్రాబాద్(12514), సికింద్రాబాద్-హౌరా(12704), యశ్వంతపూర్-హౌరా(12864), 24న హౌరా-సికింద్రాబాద్(12703), శాలిమార్-వాస్కో(18047), సికింద్రాబాద్-మాల్దా(03429), 25న భువనేశ్వర్-సికింద్రాబాద్(17015), భువనేశ్వర్-బెంగళూరు(18463), 26న సికింద్రాబాద్-సిల్చార్ రైళ్లను నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

పలు రైళ్లకు అదనపు బోగీలు: విజయవాడ-గుంటూరు(07783), గుంటూరు-విజయవాడ (07788), నడికుడి-మాచర్ల (07579), మాచర్ల-నడికుడి (07580), గుంటూరు-మాచర్ల (07779), మాచర్ల-గుంటూరు (07780) రైళ్లకు ఈనెల 23 నుంచి నవంబరు 23 వరకు రెండు జనరల్ బోగీలు అదనంగా ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

'ప్రతి విషయాన్ని రాజకీయం చేస్తున్న వైకాపా నేతలు'

పట్టాభిపురం, న్యూస్‌టుడే: గత అయిదేళ్ల పాటు వైకాపా నేతలు చేసిన అరాచకాలు, అక్రమాలు, అవినీతి, తప్పుడు పనులకు ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పినా వారి ప్రవర్తనలో మార్పు రాలేదు. ప్రతి విషయాన్ని రాజకీయం చేయడమే పనిగా పెట్టుకున్నారు'..అని తెదేపా నేతలు, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ విమర్శించారు. గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో బ్రెయిన్ డెడ్ యువతి సహానాను మంగళవారం ఉదయం (చనిపోక ముందు) పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్‌కు సూచించారు. ఆనందబాబు, రాజేంద్రప్రసాద్‌లు మాట్లాడుతూ 'సహనా ఘటనను వైకాపా నేతలు రాజకీయ రంగు పులమాలని చూడడం సిగ్గుచేటు. వైద్య చికిత్స అందడం లేదని ఆరోపణలు చేయడం ఎంత వరకు సమంజసం. జగన్ గుంటూరుకు వస్తే భూమి బద్ధలవుతుందా. వైకాపా నేతల వలే నిందితుల్ని రక్షించడం లేదు. నిందితుడు నవీన్‌ను వెంటనే అరెస్టు చేయించాం'.. అని చెప్పారు. కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు కనపర్తి శ్రీనివాసరావు, చిట్టాబత్తిన చిట్టిబాబు పాల్గొన్నారు.

ధర వరలు



పట్టాభిపురం, న్యూస్‌టుడే: కృష్ణనగర్ రైతుబజార్‌లో నిన్నటి ధరలు(కిలో రూ.ల్లో) టమాట 38, వంగ 38, బెండ 44, పచ్చిమిర్చి 44, కాకర 48, క్యారెట్ 48, బీర 44, క్యాబేజి 30, దొండ 32, బంగాళదుంప 39, ఉల్లిపాయలు 38, గోరుచిక్కుళ్లు 34, దోస 34, సొర 26, పొట్లకాయ 30, అరటికాయ 7, బీట్‌రూట్ 32, క్యాప్సికం 64, కీరదోసకాయ 24, కొత్తిమీర 30, ఆకుకూరలు 15, నిమ్మకాయలు 45, అల్లం 70, వెల్లుల్లి 340.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

గుంటూరు విద్యుత్తు, న్యూస్‌టుడే: టౌన్-2 సబ్ డివిజన్ పరిధిలో విద్యుత్తు లైన్లు మరమ్మతులు చేస్తున్నందున ఈనెల 23వ తేదీన విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈఈ గురవయ్య తెలిపారు. దీని వల్ల బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎస్వీఎన్‌కాలనీ, నేతాజీనగర్, వైష్ణవినగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

డిసెంబరు 10 లోపు విద్యాజ్యోతి మెటీరియల్

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న పదో తరగతి విద్యార్థులకు విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్‌ను డిసెంబరు 10 లోపు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారులను జిల్లాపరిషత్తు చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా ఆదేశించారు. జడ్పీ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు, గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల విద్యాశాఖ అధికారులతో విద్యాజ్యోతి మెటీరియల్ రూపకల్పనపై మంగళవారం సమావేశం నిర్వహించారు. క్రిస్టినా మాట్లాడుతూ ఏటా పదో తరగతి విద్యార్థులకు ఉచితంగా మెటీరియల్ అందజేస్తున్న 2024-25లో కూడా అందజేస్తామన్నారు. 34,573 మంది విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అవసరమని అధికారులు తెలిపారు. ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ సకాలంలో అందేలా చూడాలన్నారు. సమావేశంలో జిల్లాపరిషత్తు సీఈవో జ్యోతిబసు, డిప్యూటీ సీఈవో సి.హెచ్.కృష్ణ, మూడు జిల్లాల విద్యా శాఖ అధికారులు పాల్గొన్నారు.

29, 30 తేదీల్లో ప్రభుత్వ ఉద్యోగులకు పోటీలు

గుంటూరు క్రీడలు: రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈనెల 29, 30 తేదీల్లో జిల్లాలోని ప్రభుత్వ సివిల్ సర్వీసెస్ ఉద్యోగులకు పలు క్రీడాంశాల్లో జిల్లా స్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి నరసింహారెడ్డి తెలిపారు. 29న అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, క్యారమ్స్, చెస్, క్రికెట్, ఫుట్‌బాల్, ఖోఖో, వెయిట్‌లిఫ్టింగ్ పోటీలు జరుగుతాయన్నారు. 30న హాకీ, కబడ్డీ, టెన్నిస్, పవర్ లిఫ్టింగ్, వెయిట్ లిఫ్టింగ్, టేబుల్ టెన్నిస్, వాలీబాల్, రెజ్లింగ్, స్విమ్మింగ్, మ్యూజిక్, డ్యాన్స్, షార్ట్ ప్లే పోటీలు జరుగుతాయన్నారు. ఎంపికైన వారిని నవంబర్ 6 నుంచి 9వ తేదీ వరకు జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపుతామన్నారు. ఆసక్తి ఉన్నవారు ప్రభుత్వ గుర్తింపుకార్డుతో బీఆర్ స్టేడియానికి ఉదయం 9 గంటలకు హాజరుకావాలన్నారు. వివరాలకు 94418 18491 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

జనవరి 5న విజయవాడలో హైందవ శంఖారావం

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: దేవాలయాల వ్యవస్థ సమూల ప్రక్షాళనకు జనవరి 5న గుంటూరు, విజయవాడల మధ్య విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో హైందవ శంఖారావం నిర్వహించనున్నట్లు విశ్వ హిందూ పరిషత్ ఆంధ్రప్రదేశ్ (ఉత్తరం) ప్రాంత మందిర-అర్చక పురోహిత ప్రముఖ్ ఎస్.పల్లలరావు తెలిపారు. బ్రాడీపేటలోని విశ్వహిందూ పరిషత్ కార్యాలయంలో గుంటూరు జిల్లా అర్చక పురోహిత సమావేశం మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దేవాలయ వ్యవస్థను కాపాడుకోవడం కోసం వీహెచ్‌పీ హైందవ శంఖారావానికి పిలుపునిస్తోందన్నారు. కార్యక్రమాన్ని వీహెచ్‌పీ జిల్లా మందిర-అర్చక పురోహిత ప్రముఖ్ పల్లపాటి రాధాకృష్ణ నిర్వహించారు. జిల్లా ఉపాధ్యక్షుడు మురళి, ప్రాంత సామాజిక సమరసతా ప్రముఖ్ చిరుమామిళ్ల గోపి, జిల్లా సహ ప్రముఖ్ తాడికొండ పవన్‌కృష్ణ, కోగంటి రఘుబాబు, అన్ని ప్రఖండ ప్రముఖులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

97042 53525, 80085 74897

కాలువలో పూడికతీత: కలకరగుంట బ్రిడ్జి కింద డ్రెయిన్‌లో నిరుపయోగ సామగ్రి పేరుకుపోయి మురుగు కదలడంలేదు. దీంతో దోమలు వ్యాపిస్తున్నాయి. సమస్యను 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా జీఎంసీ శానిటరీ సూపర్‌వైజర్ సోమశేఖర్ దృష్టికి తీసుకెళ్లాం. ఆయన స్పందించి 83 సచివాలయ శానిటరీ కార్యదర్శి సంజయ్ నాయక్, సిబ్బందిని పంపించి కాలువలోని వ్యర్థాలు తొలగించేలా చర్యలు తీసుకున్నారు.

చెత్త గుట్టలు తొలగింపు: ఆటనగరాలతోట పీకలవారి దగ్గర రహదారి చెత్త గుట్టలతో అపరిశుభ్రంగా దర్శనమిస్తోంది. ఈ సమస్యపై 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా జీఎంసీ శానిటరీ సూపర్‌వైజర్ సోమశేఖర్ దృష్టికి తీసుకెళ్లాం. ఆయన స్పందించి 85 సచివాలయ శానిటరీ కార్యదర్శి జాబేరాయ పరిసర్, పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి రహదారిపై చెత్తగుట్టలను తొలగించారు. - న్యూస్‌టుడే, ఏటీ అగ్రహారం

స్పందనకు వందనం

సాంకేతిక పరిజ్ఞానంతో నేరాల కట్టడి

ఈనాడు, అమరావతి: సాంకేతిక పరిజ్ఞానంతో నేరాలను అదుపులోకి తేవాలని గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి పిలుపునిచ్చారు. కేసుల దర్యాప్తులో సాంకేతికతను జోడిస్తే ఫలితాలు వేరుగా ఉంటాయని చెప్పారు. ఇటీవల బాపట్ల జిల్లా వేటపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఓ దారి దోపిడీ కేవలం 48 గంటల్లో ఛేదించడానికి ఆ పరిజ్ఞానమే దోహదపడిందన్నారు. మంగళవారం సాయంత్రం రేంజ్ పరిధిలోని గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాల ఎస్పీలతో ఆయన గుంటూరులోని తన చాంబర్‌లో సమీక్షించారు. తెదేపా కేంద్ర కార్యాలయం, చంద్రబాబునాయుడు నివాసంపై గతంలో జరిగిన దాడుల కేసుల పురోగతి, ఆధారాల సేకరణపై ఎస్పీలకు వివరించారు. ఎస్పీలు సతీష్‌కుమార్, కె.శ్రీనివాసరావు, తుషార్ డూడీ, దామోదర్, కృష్ణకాంత్ పాల్గొన్నారు. ఐజీ చేసిన సూచనలు.. ✤ ప్రతి స్టేషన్ పరిధిలో సీసీ కెమెరాలతో గట్టి నిఘా ఏర్పాటు చేసుకోవాలి. ✤ గతంలో మాదిరి ప్రతి కానిస్టేబుల్‌కు ఒక ప్రాంతాన్ని దత్తత ఇచ్చి అక్కడ ఏం జరిగినా సమాచారం వచ్చేలా చూడాలి. ✤ రెగ్యులర్ కేసులను పర్యవేక్షిస్తూ వాటి పెండెన్సీని చాలా వరకు తగ్గించాలి. ✤ రౌడీషీటర్లు, పాత నేరస్థుల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాలి. ప్రతి వారం కౌన్సెలింగ్ చేస్తూ వారి కదలికల్ని తెలుసుకోవాలి. ✤ సామాజిక మాధ్యమాల్లో పోస్టింగ్‌లు పెట్టి విద్వేషాలను రెచ్చగొట్టేవారిని కట్టడి చేయాలి. బాధ్యులను పిలిపించి మాట్లాడాలి. రెండోసారి పునరావృతమైతే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించాలి. ✤ సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ఏర్పాట్లు చేయాలి. ✤ గంజాయి, ఇతర మత్తు పదార్థాల విక్రయాలకు తావులేకుండా ఉక్కుపాదం మోపాలి. వాటి పర్యవసానాలపై కళాశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలి.

నేడు గుంటూరుకు జగన్

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: వైకాపా అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం గుంటూరుకు రానున్నారు. ఉదయం 10.15కు తాడేపల్లి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి గుంటూరులో పోలీసు కవాతు మైదానానికి చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని సహన మృతదేహాన్ని సందర్శించి, కుటుంబ సభ్యులను పరామర్శించనున్నారు. 11.45 గంటలకు ప్రభుత్వాసుపత్రి నుంచి పోలీసు కవాతు మైదానానికి చేరుకుని హెలికాప్టర్‌లో కడప జిల్లా బద్వేలుకు బయలుదేరతారు.

పొట్టి శ్రీరాములునగర్‌లో చోరీ

పట్టాభిపురం, న్యూస్‌టుడే: పొట్టి శ్రీరాములునగర్‌లో చోరీ జరిగినట్లు అరండల్‌పేట ఠాణాలో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. ఎల్‌వీఆర్ క్లబ్‌లో పని చేస్తున్న సుబ్బారావు పొట్టి శ్రీరాములునగర్ ఆరోలైనులో నివాసం ఉంటున్నారు. ఆయన మంగళవారం భోజనం చేసి క్లబ్‌కు వెళ్లారు. భార్య బజార్‌కు వచ్చారు. ఇది గమనించిన దొంగ ఇంటి తలుపులు ధ్వంసం చేసి లోపలకు ప్రవేశించాడు. బీరువాలో ఉన్న బంగారు ఆభరణాలను అపహరించుకుపోయాడు. భార్య ఇంటికి వచ్చాక దొంగతనం జరిగిందని గ్రహించి విషయాన్ని భర్త సుబ్బారావుకు తెలిపారు. ఆయన అరండల్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పేదల పక్షపాతి శంకరన్




మాట్లాడుతున్న మాణిక్య వరప్రసాద్

గుంటూరు సాంస్కృతికం: విశ్రాంత ఐఏఎస్ అధికారి ఎస్ఆర్ శంకరన్ పేదల పక్షపాతి అని మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ అన్నారు. అరండల్‌పేటలోని అమరావతి బుక్ హౌస్‌లో శంకరన్ జయంతి సభ మంగళవారం జరిగింది. సభకు ఎస్ఆర్ శంకరన్ ప్రజా సంక్షేమ సంఘం అధ్యక్షుడు బత్తుల కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, వీసీకే మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు కె.జయసుధ మాట్లాడారు. మాజీ ఏజీపీ రాజారావు, సముద్రాల కోటేశ్వరరావు, జెట్టి బాబూరావు, యెనుబరి చంద్రపాల్, దాసరి జాన్‌బాబు, మాదా రాధా, పరంగి సత్యరాజు, నల్లపు నీలాంబరం, భక్తుల అనిల్‌బాబు, మెరిగల మణికుమార్, మహబూబ్ బాషా, మండాది సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ సంస్థ ఘరానా మోసం

ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించి ఉడాయించిన నిర్వాహకుడు



అరండల్‌పేట ఠాణా వద్ద బాధితులు

పట్టాభిపురం, న్యూస్‌టుడే: గుంటూరు నగరంలో ఓ సాఫ్ట్‌వేర్ సంస్థ నిర్వాహకుడు ఘరానా మోసం చేశాడు. దీనికి సంబంధించి పోలీసులు, బాధితులు తెలిపిన వివరాలిలా.. అమరావతి రోడ్డులో డి.శ్రావణ్ సాఫ్ట్‌వేర్ సంస్థ నిర్వహిస్తున్నాడు. ఉద్యోగాలు ఇప్పిస్తామని.. ప్రాజెక్టులు ఉన్నాయని.. నిరుద్యోగుల నుంచి రూ.లక్షల్లో డబ్బు వసూలు చేశాడు. ఈ విధంగా పలు ప్రాంతాలకు చెందిన నిరుద్యోగుల నుంచి రూ.1.50 లక్షల నుంచి రూ.3 లక్షలు వరకు తీసుకున్నాడు. కొందరికి ఉద్యోగాలు ఇచ్చినా.. నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదు. ఈవిధంగా 70 మంది వరకు మోసపోయారు. జీతాలు ఇవ్వమంటే ఇవ్వకుండా రోజులు వెళ్లబుచ్చుతున్నాడు. రెండు రోజుల క్రితం శ్రావణ్ ఉడాయించాడు. దీంతో ఉద్యోగులు కొందరు అరండల్‌పేట ఠాణా వద్దకు వచ్చి న్యాయం చేయాలని పోలీసుల్ని కోరారు. శ్రావణ్ భార్య స్వర్ణలతను పోలీసులు విచారిస్తున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎంత మేరకు డబ్బు వసూలు చేశాడనేది పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.

క్రమబద్ధీకరణకు వినతి

గుంటూరు వైద్యం: రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ మండలి (ఏపీ శాక్స్) పరిధిలో పని చేస్తున్న ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని ఆ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అలీ విజ్ఞప్తి చేశారు. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్‌ను కార్యాలయంలో మంగళవారం కలిసి వినతి పత్రం అందజేశారు.

తనను తాను

మనువాడిన బ్రిట్నీ!



మిసిసిపీ: అమెరికన్ పాప్‌స్టార్ బ్రిట్నీ స్పియర్స్ (42) గత ఆదివారం ఇన్‌స్టాగ్రాం వేదికగా పంచుకొన్న ఓ పోస్టు అందరినీ కలవరపాటుకు గురిచేసింది. 30 ఏళ్ల శాం అస్ఘరీతో 14 నెలలు కొనసాగిన బ్రిట్నీ వివాహబంధం ఇటీవలే ముగిసింది. గత మే నెలలో ఈ జంట విడాకుల ఒప్పందానికి వచ్చింది. ఈ నేపథ్యంలో పెళ్లిగౌను ధరించి బ్రిట్నీ ఇన్‌స్టాలో చేసిన పోస్టు అభిమానులను ఆశ్చర్యపరుస్తోంది. "నన్ను నేను పెళ్లి చేసుకున్నా. ఇది తెలివితక్కువ పనిగా మీకు అనిపించవచ్చు. కానీ, నా జీవితంలో నేను చేసిన అద్భుతమైన పనిగా దీన్ని భావిస్తున్నా" అంటూ ఆమె రాసుకొచ్చారు. ఈ పోస్టుతోపాటు పంచుకొన్న వీడియోలో నవవధువులా నిలబడిన బ్రిట్నీ పక్కన వరుడు ఎవరూ లేరు. ఎటువంటి వివరణ లేకుండా ఖాళీగా ఉన్న చర్చి ఫొటో షేర్ చేసింది. ఒంటరిగా హనీమూన్‌కు బయలుదేరుతున్నట్లు విమానం పక్కన నిలబడి ఉన్న మరో పోస్టులో "టర్క్స్ అండ్ కేకస్, ఇదిగో నేను వచ్చేశా" అని బ్రిట్నీ వ్యాఖ్య జోడించింది. టర్క్స్ అండ్ కేకస్ దీవులు అట్లాంటిక్ సముద్రంలో ఉన్నాయి.

మరో 80 విమానాలకు బాంబు బెదిరింపులు

దిల్లీ: విమానయాన సంస్థలకు గత కొద్దిరోజులుగా వస్తున్న బాంబు బెదిరింపులు ఆగడంలేదు. సోమవారం నుంచి మంగళవారం మధ్య 24 గంటల్లో దాదాపు 80 జాతీయ, అంతర్జాతీయ విమాన సర్వీసులకు హెచ్చరికలు వచ్చాయని 'బాంబు బెదిరింపుల మూల్యాంకన కమిటీ ప్రకటించింది. దీంతో 24 గంటల్లో బెదిరింపులు అందుకున్న విమానాల సంఖ్య 80కి చేరుకుంది. గత తొమ్మిది రోజుల్లో 170 విమానాలకు కలిగిన అంతరాయం వల్ల రూ.600 కోట్ల నష్టం వాటిల్లి ఉంటుందని అధికారులు తెలిపారు.



పెన్సిల్వేనియా గెలవాల్సిందే!

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో కీలకంగా మారిన రాష్ట్రం

వాషింగ్టన్: అమెరికా స్వాతంత్ర్య పోరాటంలో కీలక పాత్ర పోషించిన పెన్సిల్వేనియా ప్రస్తుతం జరుగుతున్న అధ్యక్ష ఎన్నికల్లోనూ అత్యంత కీలకంగా మారింది. అధ్యక్షులుగా ఎన్నిక కావాలంటే ఈ రాష్ట్రంలో తప్పక గెలవాల్సిన పరిస్థితి నెలకొంది. డొనాల్డ్ ట్రంప్, కమలా హారిస్ మధ్య ఈ రాష్ట్రంలో ఉత్కంఠ భరిత పోరు సాగుతోంది. పెన్సిల్వేనియాలో 19 ఎలక్టోరల్ కాలేజ్ ఓట్లున్నాయి. అత్యధికంగా కాలిఫోర్నియాలో 54 ఓట్లున్నాయి. ఇది డెమోక్రాట్లకు కంచుకోట. రిపబ్లికన్లు బలంగా ఉన్న టెక్సాస్‌లో 40 ఓట్లున్నాయి.



- దేశంలోని దాదాపు అన్ని రాష్ట్రాల్లో గతంలో అధ్యక్ష అభ్యర్థులకు వచ్చిన ఓట్ల ఆధారంగా ట్రంప్, హారిస్‌లకు వచ్చే ఓట్లను రాజకీయ నిపుణులు అంచనా వేశారు.
- ఏడు కీలక రాష్ట్రాల్లోని ఓట్లపైనే ఇప్పుడు అందరి దృష్టి కేంద్రీకృతమైంది. ఇందులో ఆరిజోనా (11), విస్కాన్సిన్ (10), మిషిగన్ (15), పెన్సిల్వేనియా (19), జార్జియా (16), నార్త్ కరోలినా (16) ఉన్నాయి.
- వేగంగా మారుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఇద్దరు అభ్యర్థులు పెన్సిల్వేనియాపై దృష్టి సారించారు. ఇక్కడ తప్పనిసరిగా గెలవాల్సిన పరిస్థితి నెలకొంది.
- ఓటర్లను ఆకట్టుకునేందుకు ట్రంప్, హారిస్‌కు సంబంధించిన వేల మంది వాలంటీర్లు పెన్సిల్వేనియాలో మకాం వేశారు.
- పెన్సిల్వేనియాలో గెలవకుండా 270 ఎలక్టోరల్ ఓట్లు సాధించడం అసాధ్యమని రాజకీయ నిపుణులు అంచనా వేస్తున్నారు.
- 270టువిన్.కామ్ వెబ్‌సైట్ అంచనా ప్రకారం.. హారిస్‌కు 226 ఓట్లు, ట్రంప్‌నకు 219 ఓట్లు రావొచ్చని అంచనా.




1 శాతం అటూఇటూ..

2016 ఎన్నికల్లో ట్రంప్ కేవలం 1శాతం ఓట్లతో పెన్సిల్వేనియాలో విజయం సాధించారు. అదే 1 శాతం ఓట్ల తేడాతో 2020లో ఈ రాష్ట్రాన్ని కోల్పోయారు.

- 2024 ఎన్నికల్లో నువ్వానేనా అన్నట్లు ఈ రాష్ట్రం ఉంది. దాదాపుగా టాస్ వేసినట్లుగానే ఫలితం ఉండవచ్చని అంటున్నారు.
- కీలక రాష్ట్రం కావడంతో ట్రంప్, హారిస్‌లు.. డబ్బు, సమయం, శక్తినంతా ఇక్కడే ధారపోస్తున్నారు. వాణిజ్య ప్రకటనలూ ఇక్కడే ఎక్కువగా ఇస్తున్నారు.
- పెన్సిల్వేనియా ఓటర్లను ఆకట్టుకోవడానికి సోమవారం నుంచి 21 మంది ప్రముఖులతో రిపబ్లికన్ పార్టీ బస్సు యాత్ర ప్రారంభించింది. ఇందులో భారతీయ అమెరికన్ కాష్ పటేల్ ఉన్నారు.
- రెండు పార్టీలకు చెందిన దాదాపు 50 సభలు గత 3 నెలల్లో పెన్సిల్వేనియాలో జరిగాయంటేనే ఇక్కడ పోటీ ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.
- ప్రతి 4 డాలర్లలో 1 డాలరును ఈ రాష్ట్రంలోనే ప్రకటనల కోసం రెండు పార్టీలు ఖర్చు చేశాయి.
- ట్రంప్ ఇటీవల మెక్ డొనాల్డ్‌లో అక్కడి సిబ్బందిలా దుస్తులు వేసుకుని పని చేసింది ఈ రాష్ట్రంలోనే కావడం విశేషం.

హెజ్‌బొల్లా రాకెట్ల వర్షం

కూల్చేసిన ఇజ్రాయెల్ ● నెతన్యాహు సేనల దాడిలో 13 మంది మృతి



బీరుట్‌లో ధ్వంసమైన భవనాల వద్ద సహాయక చర్యలు

టెల్ అవీవ్: ఇజ్రాయెల్ మధ్య ప్రాంతంపై హెజ్‌బొల్లా మంగళవారం రాకెట్లతో విరుచుకుపడింది. వాటిని ఇజ్రాయెల్ అడ్డుకుంది. ఒక రాకెట్ నిర్మానుష్య ప్రాంతంలో పడింది. ఈ దాడుల్లో ఒక రిజర్విస్టు సైనికుడు మృతి చెందాడు. దాడుల నేపథ్యంలో 10 లక్షల మంది ఇజ్రాయెలీలు సురక్షిత బంకర్లలో తలదాచుకున్నారు. విమాన సేవలకు కొంత అంతరాయం కలిగింది. మరోవైపు సోమవారం రాత్రి ఇజ్రాయెల్ జరిపిన దాడిలో 13 మంది లెబనాన్ వాసులు మరణించారు. పలువురు గాయపడ్డారు. ఇటు పశ్చిమాసియాలో పర్యటిస్తున్న అమెరికా విదేశాంగశాఖ మంత్రి ఆంటోనీ బ్లింకెన్.. కాల్పుల విరమణకు అవకాశాలు స్వల్పమేనని పేర్కొన్నారు. హెజ్‌బొల్లా మంగళవారం ఇజ్రాయెల్‌లోని జనసమర్థ ప్రాంతాలపై రాకెట్ దాడులు చేసింది. అయితే ఎటువంటి నష్టం జరగలేదని ఇజ్రాయెల్ సైన్యం వెల్లడించింది. బ్లింకెన్ ఇజ్రాయెల్‌కు రావడానికి కొద్ది గంటల ముందు ఈ దాడులు జరిగాయి. 5 ప్రొజెక్టైల్స్‌ను లెబనాన్ నుంచి హెజ్‌బొల్లా ప్రయోగించిందని, వాటిలో ఒక్కటి మినహా అన్నింటినీ క్షిపణి రక్షణ వ్యవస్థ అడ్డుకుందని ఇజ్రాయెల్ తెలిపింది. ఒకటి నిర్మానుష్య ప్రాంతంలో పడిందని వెల్లడించింది. దాడుల కారణంగా బెన్ గురియన్ అంతర్జాతీయ విమానాశ్రయంలో కొంతసేపు రాకపోకలు నిలిచిపోయాయి. బీరుట్‌లోని ప్రధాన ఆసుపత్రి ప్రాంతంలో సోమవారం రాత్రి ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో 13 మంది మరణించారని లెబనాన్ ఆరోగ్యశాఖ ప్రకటించింది. 57 మంది గాయపడ్డారని తెలిపింది.

★ లెబనాన్, సిరియా సరిహద్దులోని జాతీయ రహదారిపై ఇజ్రాయెల్ దాడులు చేసింది. సిరియాలోని ప్రాంతంపై మంగళవారం ఈ దాడి జరిగినట్లు జాతీయ వార్తా సంస్థ వెల్లడించింది.

రద్దీ ప్రాంతంపై ఇజ్రాయెల్ దాడి

బీరుట్: లెబనాన్ రాజధాని బీరుట్‌కు దక్షిణాన ఉన్న రద్దీ ప్రాంతంపై మంగళవారం ఇజ్రాయెల్ దాడి చేసింది. ఈ ప్రాంతంలోనే శరణార్థి శిబిరం కూడా ఉంది. హెజ్‌బొల్లా స్థావరాలుగా పేర్కొంటూ రెండు భవనాలపై ఇజ్రాయెల్ బాంబులతో దాడి చేసింది. ఈ దాడుల్లో మరణాలపై వివరాలందలేదు. ఫ్రాన్స్ రాయబారి ఇంటికి దగ్గరలోనే ఈ దాడి జరిగింది.

వక్ఫ్ బిల్లుపై జేపీసీ భేటీ రసాభాస

- గాజుసీసా పగలగొట్టి ఛైర్మన్ వైపు విసిరిన టీఎంసీ ఎంపీ కల్యాణ్ బెనర్జీ
- ఎంపీ చేతికి గాయం..



చేతికి కట్టుతో కల్యాణ్ బెనర్జీ

దిల్లీ: కేంద్రం ప్రతిపాదించిన వక్ఫ్ సవరణ బిల్లుపై ఏర్పాటైన సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) సమావేశం మంగళవారం రసాభాసగా మారింది. ప్రారంభమైన కొద్దిసేపటికే ఎంపీలు వాగ్వాదానికి దిగారు. టీఎంసీ ఎంపీ కల్యాణ్ బెనర్జీ తనకు ఎదురుగా నీళ్ల కోసం పెట్టిన గాజుసీసాను టేబులుకేసి కొట్టగా ఆయన చేతివేళ్లకు గాయమైంది. అనంతరం పగిలిన బాటిల్‌ను ఛైర్మన్ వైపు కల్యాణ్ విసిరారు. ఫలితంగా సమావేశం వాయిదా పడింది. బెనర్జీకి పార్లమెంటు ఆవరణలోని డిస్పెన్సరీలో ప్రథమచికిత్స చేసి కుట్లు వేశారు. ఈ వ్యవహారాన్ని పార్లమెంటరీ కమిటీ తీవ్రంగా పరిగణించింది. భాజపా సభ్యుడు నిశికాంత్ దుబే తీర్మానం ప్రవేశపెట్టగా, 10-8 ఓటింగుతో ఆమోదించిన కమిటీ కల్యాణ్ బెనర్జీని సమావేశాల నుంచి ఒకరోజు సస్పెండు చేస్తూ నిర్ణయం తీసుకొంది. భాజపా ఎంపీ జగదాంబికా పాల్ అధ్యక్షతన ఏర్పాటైన సమావేశం ఒడిశాకు చెందిన రిటైర్డ్ జడ్జీలు, న్యాయవాదుల అభిప్రాయాలు వింటుండగా ఈ వివాదం తలెత్తింది.

వదిలేస్తే.. రేపు తుపాకీతో వస్తారు: పాల్

జేపీసీ సమావేశంలో జరిగిన దాడి నుంచి తాను త్రుటిలో తప్పించుకొన్నట్లు ఛైర్మన్ జగదాంబికా పాల్ తెలిపారు. సభ్యులను ఇలా వదిలేస్తే రేపటి సమావేశానికి మరొకరు రివాల్వరుతో వస్తారని మీడియా ఎదుట వ్యాఖ్యానించారు. బాటిల్‌ను ఛైర్మన్ వైపు విసరడం తన ఉద్దేశం కాదని కల్యాణ్ బెనర్జీ విచారం వ్యక్తం చేసినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.



వైఫల్యాల తర్వాత బలంగా పుంజుకోండి

జీవితం అంటే వైఫల్యాలను తప్పించుకోవడం కాదు! ఎన్ని వైఫల్యాలు ఎదురైనా తిరిగి బలంగా పుంజుకోవడం!! గెలుపు, ఓటమి అనేవి ఒకే నాణేనికి ఉన్న రెండు ముఖాల వంటివి. ఓటమికి వెరవకుండా, ప్రతిరోజూ మిమ్మల్ని మీరు మెరుగుపరుచుకుంటూ ముందుకెళ్లండి.

– డేవిడ్ లవ్‌జాయ్, పాడ్‌కాస్టర్

గుజరాత్‌లో అయిదేళ్లుగా నకిలీ కోర్టు!

- భూవివాదాలు లక్ష్యంగా తీర్పులు
- మోసగాడైన 'జడ్జి' అరెస్టు



అహ్మదాబాద్: ఉత్తుత్తి బ్యాంకులు.. పోలీసులు.. ఇపుడు ఏకంగా కోర్టులు కూడా ఈ జాబితాలో చేరాయి. గుజరాత్ రాజధాని నగరంలో గత అయిదేళ్లుగా "తీర్పులు" ఇస్తున్న నకిలీ కోర్టు గుట్టు రట్టయ్యింది. నకిలీ ట్రైబ్యునల్ ఏర్పాటు చేసి, న్యాయమూర్తిగా తీర్పులు ఇచ్చిన మోరిస్ శామ్యూల్ క్రిస్టియన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. శామ్యూల్ అనుచరులే కోర్టు సిబ్బందిగా, న్యాయవాదులుగా నటించేవారు. గాంధీనగర్‌లోని తన కార్యాలయంలో నిజమైన కోర్టు వాతావరణాన్ని శామ్యూల్ సృష్టించాడని పోలీసులు తెలిపారు. అహ్మదాబాద్ సిటీ సివిల్‌కోర్టు రిజిస్ట్రారు నగరంలోని కరంజ్ పోలీస్‌స్టేషనులో ఫిర్యాదు చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. నిందితుడు శామ్యూల్ ప్రభుత్వ భూమికి సంబంధించి 2019లోనే తన క్లయింట్‌కు అనుకూలంగా ఉత్తర్వులు ఇచ్చాడు. తర్వాత ఆ భూమి రెవెన్యూ రికార్డుల్లో తన క్లయింట్ పేరును చేర్చాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేశాడు. ఈ ఉత్తర్వును అమలుచేయాలని కోరుతూ శామ్యూల్ మరొక న్యాయవాది ద్వారా సిటీ సివిల్‌కోర్టులో అప్పీల్ చేశాడు. తాను జారీ చేసిన నకిలీ ఉత్తర్వులను కూడా ఈ పిటిషనుకు జత చేశాడు. ఆ ఉత్తర్వులు నకిలీవని కోర్టు రిజిస్ట్రారు గుర్తించడంతో శామ్యూల్ బండారం బయటపడింది.

● గత అయిదేళ్లుగా శామ్యూల్ నకిలీ కోర్టు నడుస్తోంది. సిటీ సివిల్‌కోర్టులో భూవివాదాల కేసులు పెండింగులో ఉన్న కక్షిదారులను గుర్తించి నిందితుడు వల పన్నేవాడు. ప్రభుత్వం నియమించిన అధికారిక మధ్యవర్తిగా పరిచయం చేసుకునేవాడు. తర్వాత పిటిషనర్లను తన 'కోర్టు'కు పిలిపించుకునేవాడు. అక్కడ ట్రైబ్యునల్ ప్రిసైడింగ్ అధికారిగా నటిస్తూ తన క్లయింట్లకు అనుకూలమైన తీర్పులు ఇచ్చి, ఉత్తర్వులను జారీ చేస్తాడు. వారి నుంచి సొమ్ము తీసుకునేవాడు.

అభినవ ద్రోణాచార్య!

- అన్ని రంగాలనూ నడిపించేది.. డ్రోన్లే
- సాంకేతికతకు.. అభివృద్ధికి బాసట
- నూతన ఆవిష్కరణలపై నయా ఆసక్తి
- అమరావతి డ్రోన్ సమ్మిట్‌కు తరలివచ్చిన యువత

యువ



డ్రోన్‌ల విశిష్టతను వివరిస్తూ..



డ్రోన్ షోలో యువత సందడి..

ఈనాడు, ఈనాడు డిజిటల్ - అమరావతి

ఒక వినూత్న ఆలోచన.. సమాజం పురోభివృద్ధి వైపు అడుగులు వేసేందుకు దోహదపడుతోంది. నిత్య జీవితంలో ఎన్నో సమస్యలకు పరిష్కారం చూపిస్తోంది. కొత్త పుంతలు తొక్కుతున్న సాంకేతిక పరిజ్ఞానం మానవాళికి ఎంతో ఉపయోగపడుతోంది. భవిష్యత్తులో పలు రంగాల్లో డ్రోన్ టెక్నాలజీ కీలక మార్పులు తీసుకురానుంది. ఇప్పుడిప్పుడే అనేక అవసరాలకు డ్రోన్లు అక్కరకొస్తున్నాయి. తప్పిపోయిన వ్యక్తులను కనిపెట్టడం.. ప్రకృతి వైపరీత్యాల వేళ బాధితులకు ఆహారం, మందులు అందించడం.. నష్టాలను అంచనా వేయడం.. జన సమూహాలపై నిఘా.. వ్యవసాయంలో సస్యరక్షణ.. వంటి విభాగాల్లో ఎంతో ఉపకరిస్తున్నాయి. ఈ రంగంలో కొత్త ఆవిష్కరణలు, విభిన్న అవసరాలకు ఉపయోగపడే డ్రోన్లు, వాటిల్లో నూతన సాంకేతికత, అభివృద్ధిలో డ్రోన్ల పాత్ర, తదితర అంశాలతోపాటు భవిష్యత్తు మార్గసూచీపై గుంటూరు జిల్లా మంగళగిరిలో 'అమరావతి డ్రోన్ సమ్మిట్' ప్రారంభమైంది. దీనికి దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రతినిధులు, సందర్శకులు పెద్దఎత్తున పాల్గొన్నారు. సదస్సుకు వచ్చిన పలువురు ఇది తమకు ఎంతో ఉపయోగపడిందనీ, భవిష్యత్తులో తమ ప్రాజెక్టుల రూపకల్పనకు అక్కరకొస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

సొంతంగా ఎదగాలనే స్టార్టప్ ఏర్పాటు



నాకు విదేశీ వస్తువులంటే పెద్దగా ఇష్టం ఉండదు. దేశీయంగా తయారు చేయాలనే పట్టుదలతోనే స్టార్టప్ ఏర్పాటు చేశాను. నేను అనంతపురం జేఎన్‌టీయూలో బీటెక్ చదివిన తర్వాత హైదరాబాద్ ఐఐటీలో ఇటీవలే ఇంజినీరింగ్‌లో మాస్టర్స్ పూర్తి చేశాను. ఐఐటీ ప్రాంగణంలో ఉన్న టింకర్స్ ల్యాబ్‌లో నేను ఎక్కువ సమయం గడిపా. అక్కడ సొంతంగా రోబోటిక్ చెయ్యిని తయారు చేసేందుకు చాలా కష్టపడ్డా. ఆ ప్రయోగం విఫలమైంది. ఇది నాలో పట్టుదల పెంచింది. డ్రోన్ల ప్రాజెక్టుకు 'ఆమని ఆటోమేషన్', కృత్రిమ మేధస్సు కోసం 'ఎక్స్ న్యూరోపిల్' అనే స్టార్టప్స్ ఏర్పాటు చేశాను. డ్రోన్ల వేగాన్ని నియంత్రించేందుకు ఎలక్ట్రానిక్ స్పీడ్ కంట్రోలర్ (ఈఎస్‌సీ) పరికరాలను సొంతంగా తయారు చేసి ఆర్డర్లపై సరఫరా చేస్తున్నా. నా వద్ద ఉన్న నిపుణుల బృందం తోడ్పాటుతో.. వచ్చే ఆర్డర్లను తీసుకుని తయారు చేయించి ఇస్తున్నా. వచ్చిన లాభంలో వారికి వాటా ఇస్తున్నా. భవిష్యత్తులో రోబోటిక్స్‌లో పరిశోధనలపైనా దృష్టి సారిస్తా. సాంకేతిక పరిజ్ఞానంతో బయోడీజిల్ తయారు చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నా.

- ఎ.పురంధర్, ఎం.టెక్, ఐఐటీ హైదరాబాద్

నిఘా మరింత మెరుగుపరిచేలా...



మేం ఇంజినీరింగ్‌లో రోబోటిక్స్ అండ్ ఆటోమేషన్ విభాగాన్ని ఎంచుకున్నాం. వివిధ వస్తువులను సరఫరా చేసే డ్రోన్లను తయారు చేస్తున్నాం. భవిష్యత్తులో రాత్రి సమయాల్లో పోలీసులకు అక్కరకొచ్చేలా గస్తీకి ఉపయోగపడేలా తయారు చేయాలని భావిస్తున్నాం. అసాంఘిక శక్తుల జాడ పసిగట్టగానే అలారం మోగేలా తయారు చేస్తాం. దీనిని వీలైనంత త్వరగా రూపొందించి వినియోగంలోకి తీసుకురావాలన్న పట్టుదలతో ఉన్నాం. పరిశ్రమల్లో డ్రోన్ల తయారీలో విభాగంలో ఇంటర్న్‌షిప్ అవకాశాలు తెలుసుకునేందుకు సదస్సుకు వచ్చాం. డ్రోన్లు మరింతగా అభివృద్ధి చేసేలా సమ్మిట్‌కు వచ్చిన వారితో చర్చించి సూచనలు, సలహాలు తీసుకున్నాం.

- సీహెచ్.జ్యోతిక, ఎస్.భార్గవి, ఎం.ప్రత్యూష, విజ్ఞాన్ యూనివర్సిటీ, వడ్లమూడి

మార్గం నిర్దేశిస్తే.. గమ్యస్థానం చేరేలా..



మేం ఈసీఈ రెండో ఏడాది చదువుతున్నాం. విమానయాన రంగమంటే చాలా ఇష్టం. ఆ ఆసక్తితో డ్రోన్లపై పరిశోధనలను ప్రారంభించాం. కనీస సౌకర్యాలు అంతంతమాత్రంగా ఉండే గ్రామీణ ప్రాంతాల్లో వీటిని విరివిగా వినియోగిస్తేనే పరిశోధనల ఫలాలు మారుమూల ప్రాంతాలకూ చేరతాయి. డ్రోన్లకు జీపీఎస్ పరికరాన్ని అమర్చి, మార్గాన్ని నిర్దేశించి గమ్యస్థానం చేరేలా తయారు చేశాం. తప్పిపోయిన వ్యక్తిని ఫేషియల్ రికగ్నేషన్ ద్వారా గుర్తించే సాంకేతికతను జోడించాం. గ్రామీణ ప్రాంతాల్లో అత్యవసర వస్తువులను సరఫరా చేసే మరో రెండు డ్రోన్లను కూడా రూపొందించాం. మరింత సామర్థ్యం గల డ్రోన్ల తయారీకి నలుగురం కలిసి బృందంగా ఏర్పడి ప్రయోగం చేస్తున్నాం. ఈ సమ్మిట్ ద్వారా కొత్త ఆవిష్కరణలు తెలుసుకున్నాం.

- పుష్పక్, ఆశిష్, ఎస్ఆర్ఎం యూనివర్సిటీ, అమరావతి

అవయవాలను తరలించే డ్రోన్ల తయారీపై దృష్టి

మేము మెకానికల్ ఇంజినీరింగ్ నాలుగో సంవత్సరం చదువుతున్నాం. మా కళాశాలలో ఇదివరకే పంటలపై పురుగు మందులు పిచికారీ చేసే డ్రోన్, తప్పిపోయిన వారిని అన్వేషించేందుకు ఉపయోగపడే వాటిని రూపొందించాం. వివిధ అవసరాలకు పనికొచ్చేలా డ్రోన్ల అభివృద్ధికి ఉపకరిస్తుందని ఈ సదస్సుకు వచ్చాం. అవయవ దానం తర్వాత వాటిని తరలించేందుకు ఇప్పుడు అంబులెన్సులకు గ్రీన్ ఛానల్ ఇస్తే కానీ సకాలంలో తీసుకెళ్లలేని పరిస్థితి. కాలహరణాన్ని అధిగమించేందుకు డ్రోన్ల ద్వారా అవయవాలను రవాణా చేసే అంశంపై దృష్టి సారించాం. గత ఏడాది ఐఐటీ మద్రాస్‌లో జరిగిన వర్క్‌షాప్‌లో మేం తయారు చేసిన పలు డ్రోన్లను ప్రదర్శించి, వాటి గురించి వివరించాం. మా ఆవిష్కరణలకు బహుమతులు వరించాయి.

- పి.శశిధర్, పి.తిరుమలేష్, కె.వి.సాయితేజ, డి.ధీరజ్, ఎస్.డి. నవాజ్.. నారాయణ ఇంజినీరింగ్ కళాశాల, నెల్లూరు





లేజర్ షో వీక్షిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు



డ్రోన్ల తళుకులు



ప్రజలతో కరచాలనం చేస్తూ..

సకళాభివందనం!

భవానీపురం, విద్యాధరపురం: కృష్ణా తీరాన ఆహ్లాద వాతావరణంలో పున్నమి, భవానీ ఘాట్‌ల వేదికగా నిర్వహించిన డ్రోన్ షో ఆద్యంతం అలరించింది. సభా వేదికపై నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. నాట్యకళాకారుడు అజయ్‌కుమార్ బృందం చేసిన కూచిపూడి, జానపద నృత్యాలు ఆకట్టుకున్నాయి. శంభో...శివ శంభో, ఘల్లు...ఘల్లు... జోడెడ్లు బండ్లు అంటూ సాగిన నృత్యాలు అలరించాయి. గణపతి బప్పా మోరియా, నాటు...నాటు, నాకముక... నాకముక నృత్యాలు ఆహుతులను రంజింపజేశాయి. వికాస్ డ్రీమ్ టీమ్ విన్యాసాలతో కూడిన నృత్యం ఆకట్టుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు చప్పట్లతో అభినందనలు తెలియజేశారు. మ్యూజిక్ బ్యాండ్ అలరించింది. వందేమాతరం..., కుర్రాళ్లోయ్.. కుర్రాళ్లు, కరిగిపోయాను...కర్పూర వీణలా అని సాగిన గీతాలు రంజింపజేశాయి. లేజర్ షో ఆద్యంతం ఆకట్టుకుంది. వీవీఐపీలకు రాత్రి భోజనం ఏర్పాటు చేయగా ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, మంత్రులు డిన్నర్ చేసి వెళ్లారు.